



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 242 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల గురువారం 7 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 242 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA THU 7 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# రైతులకు వేగంగా విత్తన సరఫరా చేయాలి

మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్

పంటలకు ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా అధిక ఆదాయం

వ్యవసాయ, ఉద్యాన పంటల కొనుగోళ్ల అంశంపై సీఎం చంద్రబాబు సమీక్ష

**పెన్ పవర్ డెస్క్:**ఈ ఏడాది మే 15 నుంచే రైతులకు సాగునీరు అందించనున్న దృష్ట్యా రాష్ట్రంలో వేగంగా విత్తన సరఫరా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేశారు. విత్తనాల సరఫరా కోసం రూ.200 కోట్లు కేటాయించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో బుధవారం రాష్ట్రంలో ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ తదితర పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి వ్యవసాయ, ఉద్యాన శాఖలతో సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షకు మంత్రి కె. అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా రైతులు పండించే పంటలకు ధరలు దక్కేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా పంటలకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతుకు లాభసాటిగా ఉండేలా నాణ్యమైన పంట దిగుబడులు వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు.మరిన్ని పంటలను ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు.



సేంద్రీయ సాగుకు కంపోస్టు ఎరువును సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ ఏడాది 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట ఉత్పత్తి వస్తుందని అధికారులు వివరించారు. మొక్క జొన్న సహా ఇతర పంటల ద్వారా ఇథనాల్ తయారీకి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు.మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు

మిగతా 2లో



## అలా చేస్తే కేసులు వాపస్: మంగ్లీకి న్యాయవాది సుబ్బారావు కీలక సూచన

- బాధితులకు డబ్బులు చెల్లిస్తే కేసులు వాపస్ తీసుకుంటామన్న న్యాయవాది
- కానీ ఈ కేసులో ఆమె తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం
- మంగ్లీ, ఆమె సోదరుడిపై వివిధ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయని వెల్లడి
- వీటికి వారు ఏం సమాధానం చెబుతారని ప్రశ్న

మిగతా 2లో



## రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు 17వ ఎస్ఐపీబీ ఆమోదం

- విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్‌కు గ్రీన్ సిగ్నల్
- సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్
- కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు
- తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమ
- రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం... 39 వేల మందికి ఉద్యోగాలు
- నిర్దేశిత గడువుకు ముందే అనుమతులతో ఓ బ్రాండ్ సృష్టిద్దాం
- సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వస్తోంది. విశాఖలో రిలయన్స్ సంస్థ రూ.1,08,010 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. అలాగే సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ ను, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను కూడా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనుంది. కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును, తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. వీటితో పాటు పలు పెట్టుబడులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు బుధవారం ఆమోదం తెలిపింది.

మిగతా 2లో



## మెదక్‌లో దారుణం.. పసికందును రూ.1.50 లక్షలకు అమ్మేసిన నర్సు

- బిడ్డ చనిపోయిందని తల్లిని నమ్మించి మోసం
- రూ.1.50 లక్షలకు శిశువును విక్రయించిన వైనం
- ఐదు రోజుల తర్వాత తల్లికి తెలిసిన అసలు నిజం
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

మిగతా 2లో

## విమర్శించడం తప్ప పేర్ని నానికి బందరు ప్రయోజనాలు పట్టవు



- బందరు చరిత్ర తిరగరాసేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామన్న కొల్లు రవీంద్ర
- రోడ్లు, తాగునాటి సౌకర్యాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని వెల్లడి
- గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందకుండా చేసిందని విమర్శ

మిగతా 2లో

## తమిళ రాజకీయాల్లో కొత్త ట్విస్ట్!

### విజయ్‌కు పోటీగా డీఎంకే, అన్నాడీఎంకే కలుస్తాయా?

- డీఎంకే, అన్నాడీఎంకే మధ్య పొత్తు కోసం చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం
- రెండు పార్టీలు కలిసినా, ప్రభుత్వ ఏర్పాటుకు చిన్న పార్టీల సహకారం తప్పనిసరి
- అన్నాడీఎంకేతో కలవబోమన్న డీఎంకే నాయకుడు

**పెన్ పవర్ డెస్క్:**తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త ట్విస్ట్! బద్ధ రాజకీయ శత్రువులైన డీఎంకే, అన్నాడీఎంకే మధ్య పొత్తు కోసం చర్చలు జరుగుతున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అయితే ఈ ప్రచారాన్ని డీఎంకే పార్టీ కొట్టి వేయడం గమనార్హం. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ టీవీకే పార్టీ 108 స్థానాలు గెలిచి, మేజిక్ ఫిగర్‌కు 10 సీట్ల దూరంలో ఉంది. కాంగ్రెస్ పార్టీ (5) మద్దతిచ్చినప్పటికీ విజయ్‌కి బలం సరిపోలేదు. దీంతో విజయ్ ప్రమాణ స్వీకారం వాయిదా పడినట్లు కూడా వార్తలు వచ్చాయి.ఈ సమయంలో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. తమకు తగినంత సంఖ్యాబలం ఉందని డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు గవర్నర్‌కు సంకేతాలు కూడా పంపించినట్లు వార్తలు వస్తున్నాయి. చర్చలు జరిగాయని

మిగతా 2లో





## విద్యలో గాలిలో మేడలు వద్దు గట్టి పునాదే ముద్దు... అక్కడి నుంచే లోకేశ్ సంస్కరణలు

- పాఠశాల విద్యలో సమస్యలు గుర్తింపు.. సంస్కరణల అమలు
- పునాది దశ అభ్యసనాలు మెరుగుపరిచేందుకు ప్రణాళికలు అమలు
- జీ-ఎఫ్ఎల్ఎన్, టీపీఆర్ఎల్‌తో ప్రాథమిక విద్యలోనే బలమైన పునాది
- ఫ్యాన్సీ విద్యా విధానాల జోలికి వెళ్లని మంత్రి లోకేశ్

**పెన్ పవర్ డెస్క్:**గాలిలో మేడలు కట్టొద్దు అని హితవు చెప్పే పెద్దలు నేలపై నిలబడమంటారు. సవాళ్లతో కూడిన విద్యాశాఖను చేపట్టిన నారా లోకేశ్ గాలిలో మేడలు కట్టే యంత్రాంగానికి అసలు మన విద్య ఎక్కడుందో చూడండంటూ

మిగతా 2లో

## విజయ్‌కు షాకిచ్చిన గవర్నర్.. ప్రభుత్వ ఏర్పాటుకు బ్రేక్

- రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన విజయ్
- మ్యాజిక్ ఫిగర్ 118కి మరో 6 సీట్లు తక్కువగా ఉన్న వైనం
- 118 మంది సభ్యుల సంతకాలు ఉంటేనే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తానన్న గవర్నర్



**పెన్ పవర్ డెస్క్:**తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య మలుపు చోటుచేసుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైన టీవీకే అధినేత విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ నుంచి ప్రతికూల స్పందన ఎదురైంది. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన విజయ్‌కు,

మిగతా 2లో

## ఇరాన్ సహకరించకుంటే మళ్లీ బాంబుదాడులు మొదలవుతాయి

- ఇరాన్ ఒప్పందం కుదుర్చుకుంటే ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ముగిసిపోతుందన్న ట్రంప్
- ఇరాన్ సహా అందరికీ హార్మూజ్ జలసంధి తెరుచుకుంటుందని వెల్లడి
- లేదంటే గతంలో కంటే భీకరస్థాయిలో బాంబు దాడులు ఉంటాయన్న ట్రంప్

**పెన్ పవర్ డెస్క్:**ఒప్పందానికి ఇరాన్ సహకరిస్తే హార్మూజ్ జలసంధి తెరుచుకుని అంతా ప్రశాంతంగా ఉంటుందని, లేదంటే మళ్లీ బాంబు దాడులు మొదలవుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చుకుంటే ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ముగిసిపోతుందని అన్నారు. అప్పుడు ఇరాన్ సహా అందరికీ హార్మూజ్

మిగతా 2లో





## ఏపీకి రూ.1000 కోట్ల పెట్టుబడి..

### క్యారియర్ ఏసీ పరిశ్రమకు మంత్రి లోకేశ్ శంకుస్థాపన

- శ్రీసిటీలో క్యారియర్ ఏసీల తయారీ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి
- రూ.1000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు.. 3000 మందికి ఉపాధి అవకాశాలు
- సీఎం చంద్రబాబు తన గదిని 17లేజ వద్ద ఉంచుతారని లోకేశ్ సరదా వ్యాఖ్య
- డేటా సెంటర్లను ఆకర్షించడమే కాదు, వాటి తయారీ వ్యవస్థనే నిర్మిస్తున్నామన్న లోకేశ్
- డేటా సెంటర్ల రంగంలో ఏపీ అగ్రగామిగా నిలుస్తుందని ధీమా

మిగతా 2లో




## విద్యలో గాలిలో మేడలు వద్దు గట్టి పునాదే ముద్దు...

# అక్కడి నుంచే లోకేశ్ సంస్కరణలు

- మొదటి పేజి తరువాయి

ఆదేశాలిచ్చారు. విదేశాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని, విదేశాల్లోనే వరల్డ్ బ్యాంకులో ఉన్నత ఉద్యోగం చేసిన లోకేశ్ విద్యాశాఖలో ఫ్యాన్సీ విదేశీ విద్యావిధానాలు అమలు చేయాలని యత్నించలేదు. గత పాలకుల మాదిరిగా టోఫెల్, ఐబీ అంటూ నేల విడిచి సాము చేయలేదు. నేషనల్ అచీవ్ మెంట్ సర్వే, యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ నివేదికల మేరకు కనీస అభ్యసనా సామర్థ్యాలు విద్యార్థుల్లో లేవని గుర్తించారు. ఇవి పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**దేశంలోనే తొలిసారిగా .గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్**

భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 38391 ప్రాథమిక పాఠశాలల్లో గ్యారెంటీడ్ ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (జీ–ఎఫ్ఎల్ఎన్) అమలు ఆరంభించారు. ప్రతీ విద్యార్థికి బలమైన పునాది అభ్యసనాలు ఒత్తిడితో కాదు, ఉల్లాసంతో, ఆటపాటలతో మొదలవ్వాలి. అందుకే మన ప్రభుత్వ పాఠశాలల్లో 1, 2 తరగతుల విద్యార్థుల కోసం గ్యారెంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (జీ–ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. మన ప్రాథమిక పాఠశాలల్లోకి అడుగుపెడితే, విద్యార్థులు పుస్తకాల్లోని అంశాలను బట్టీ పట్టడం కాకుండా, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, ఎడ్యుటైన్‌మెంట్ యాక్టివిటీస్ వంటి, బాలా ఫీచర్స్ వంటి బోధన ద్వారా ఎంతో సరదాగా, ఆహ్లాదకరంగా, ఆనందంగా, ఆడుతూ పాడుతూ నేర్చుతున్నారు. చిత్రాల ద్వారా అక్షరాలు నేర్చుకోవడం, ఆటల ద్వారా అంకెలు లెక్కించడం వంటి పద్ధతుల ద్వారా తెలుగు, ఇంగ్లీష్ భాషలను బోధిస్తున్నారు.జ్ఞానజ్యోతి, జ్ఞానప్రకాశ్ వంటి మాడ్యూల్స్ ద్వారా ప్రతి అక్షరాన్ని, ప్రతి శబ్దాన్ని అనుభూతి చెందుతూ విద్యార్థులు నేర్చుకుంటున్నారు. పెద్ద తరగతులకు వెళ్ళే వరకు వేచిచూడకుండా, మొదటి నుండే పునాదిని బలంగా నిర్మించడం గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రత్యేకత. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలకు అనుగుణంగా, వారి స్థాయిని అంచనా వేసి తదనుగుణంగా పాఠ్య ప్రణాళిక సిద్ధంచేశారు. రెగ్యులర్ క్లాసులు పూర్తయిన తరువాత మధ్యాహ్నం 1 గంట నుంచీ 3.30 వరకూ రెమెడియల్ సెషన్స్ కొనసాగిస్తున్నారు.

**సులభతర బోధనకు, బోధనాభ్యసన సామగ్రి పంపిణీ**

ఆంధ్రప్రదేశ్‌లో గ్యారెంటీడ్ ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్ర శిక్ష పాఠశాలలకు, విద్యార్థులకు వివిధ రకాల బోధనా సామగ్రిని (టీఎల్ఎస్) అందజేశాయి. 2025–26 విద్యా సంవత్సరంలో సరఫరా చేసిన వస్తువుల వివరాలు ఇక్కడ ఉన్నాయి:

**అభ్యాస కిట్లు (లర్నింగ్ కిట్స్)**

1. జాదూయ్ పిటారా: ఇది ఆటల ద్వారా నేర్చుకోవడానికి రూపొందించిన ఒక మ్యాజిక్ బాక్స్ వంటి కిట్. ఇందులో ఆటబొమ్మలు, పజిల్స్, ఫ్లాష్ కార్డులు, కృత్యాధార బోధన కోసం అవసరమైన 62 వస్తువులు ఉంటాయి. ఇది రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12,000 పాఠశాలలకు అందించబడింది.
2. ఎఫ్.ఎల్.ఎన్ లెర్నింగ్ కిట్లు: స్కూల్ కాంప్లెక్స్ ద్వారా మిగిలిన 26391 పాఠశాలలకు పంపిణీ చేశారు. ప్రాథమిక విద్యార్థుల్లో భాషా, గణిత సామర్థ్యాలను పెంచడానికి ఇవి ఉపయోగపడతాయి.
3. ఎఫ్.ఎల్.ఎన్ ప్రింట్ రీచ్ మెటీరియల్: పాఠశాలల్లోని తరగతి గదులను అభ్యసన కేంద్రాలుగా మార్చడంలో ప్రింట్ రీచ్ మెటీరియల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది విద్యార్థులు తమ చుట్టూ ఉన్న వాతావరణం ద్వారా సహజంగా భాషను, అక్షరాలను నేర్చుకోవడానికి తోడ్పడుతుంది. ఎఫ్.ఎల్.ఎన్ అమలులో భాగంగా వర్ణమాల, గుణింతాలు, సంఖ్యలు, కీలక పదాల చార్టులు, నిత్యం కొత్త పదాలను ప్రదర్శించే వర్డ్ వాల్, బొమ్మల కథల పుస్తకాలు, ఫ్లాష్ కార్డ్స్ కలిగిన రీడింగ్ కార్నర్స్, తరగతి గదిలోని వస్తువులకు బైలింగువల్ లేబులింగ్, విద్యార్థుల సృజనాత్మకతను చాటే వర్క్ డిస్ ప్లే, బొమ్మలతో కూడిన సూచన బోర్డులను ప్రభుత్వం అందించింది. ఈ మెటీరియల్ ద్వారా విద్యార్థులు ఖాళీ సమయంలో కూడా నిరంతరం నేర్చుకుంటూ, చదువు పట్ల భయాన్ని వీడి పఠనాసక్తిని పెంపొందించుకుంటారు.
4. బీఏఎల్ఏ ఫీచర్లు: పాఠశాల భవనాన్ని కేవలం నాలుగు గోడల నిర్మాణంగా కాకుండా, ఒక సజీవ బోధనా సాధనంగా మార్చడమే బీఏఎల్ఏ యొక్క అసలు ఉద్దేశం. ఈ విధానం విద్యార్థుల విభిన్న అభ్యసన శైలులకు అనుగుణంగా ఉంటూ, చూసి నేర్చుకునే వారికి ఆకర్షణీయమైన చిత్రాలను, చేసి నేర్చుకునే వారికి నేలపై ఇంటరాక్టివ్ ఆటలను అందిస్తుంది. దీనివల్ల నెమ్మదిగా నేర్చుకునే పిల్లలు సైతం ఎలాంటి ఒత్తిడి లేకుండా విషయాలను సులభంగా అవగాహన చేసుకుంటారు. గోడలపై ఉండే సైన్స్ రేఖాచిత్రాలు లేదా స్థానిక మ్యాపులు పిల్లల్లో చక్కని జిజ్ఞాసను రేకెత్తించి, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా స్వతంత్రంగా ఆలోచించేలా ప్రేరేపిస్తాయి. చదువును నిజ జీవితంతో, స్థానిక సంస్కృతితో అనుసంధానించడం ద్వారా అభ్యసనం మరింత అర్థవంతంగా మారుతుంది.
5. చైల్డ్ ఫ్రెండ్లీ ఫర్నిచర్: కొన్ని ఎంపిక చేసిన పాఠశాలలకు విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చుని కృత్యాలు చేయడానికి అనువైన ఫర్నిచర్ ఇచ్చారు.
6. అవుట్ డోర్ ప్లే మెటీరియల్: శారీరక వికాసం, ఆటల ద్వారా అభ్యసనానికి కావాల్సిన వస్తువులను సరఫరా చేశారు.

**వర్క్ బుక్స్, మెటీరియల్ (75 రోజుల యాక్షన్ ప్లాన్)**

గ్యారెంటీడ్ ఎఫ్.ఎల్.ఎన్. కోసం ప్రత్యేకంగా రూపొందించిన 75 రోజుల యాక్షన్ ప్లాన్ బుక్స్ అందించారు.

స్థాయిల వారీ పుస్తకాలు: విద్యార్థుల స్థాయిని బట్టి స్ట్రీమ్ (Stream), మౌంటైన్ (Mountain), స్కై (Sky) అనే మూడు స్థాయిలలో విడివిడిగా యాక్టివిటీ షీట్లు, మెటీరియల్ ఇచ్చారు.

ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్స్: 1 ＆ 2 తరగతులకు ఒకటి, 3 నుండి 5 తరగతులకు మరొకటి చొప్పున టీచర్లకు గైడ్ బుక్స్ అందజేశారు.

# విజయ్‌కు షాకిచ్చిన గవర్నర్.. ప్రభుత్వ ఏర్పాటుకు బ్రేక్

- మొదటి పేజి తరువాయి

సంఖ్యాబలం విషయంలో స్పష్టమైన నిబంధనలను గవర్నర్ గుర్తుచేశారు. తగినంత మెజారిటీ లేనిదే ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేమని గవర్నర్ స్పష్టం చేయడంతో తమిళనాడులో రాజకీయ సస్పెన్స్ మరింత ముదిరింది.ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన మ్యాజిక్ ఫిగర్ 118. అయితే ప్రస్తుత సమీకరణాల ప్రకారం టీవీకే బలం 108 సీట్లు (విజయ్ రెండు చోట్లా గెలవడంతో ఒక సీటుకు రాజీనామా చేయాల్సి ఉంటుంది. కాబట్టి నికరంగా 107). మద్దతు ఇస్తున్న కాంగ్రెస్ బలం 5 సీట్లు. దీంతో మొత్తం బలం 112 అవుతుంది. ఈ క్రమంలో విజయ్ పార్టీకి మరో 6 మంది ఎమ్మెల్యేల అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే టీవీకేకు ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు.

విజయ్ గవర్నర్‌తో మాట్లాడుతూ, కాంగ్రెస్‌తో పాటు మరికొన్ని చిన్న పార్టీలు తమకు మద్దతు ఇస్తున్నాయని, ప్రమాణస్వీకారం తర్వాత అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకుంటానని వివరించారు. అయితే, ముందే 118 మంది సభ్యుల సంతకాలతో కూడిన మద్దతు లేఖ ఉంటేనే ఆహ్వానిస్తామని గవర్నర్ స్పష్టం చేసినట్టు తెలుస్తోంది.

అన్నాడీఎంకే పార్టీకి ఉన్న 47 మంది ఎమ్మెల్యేలలో సీవీ షణ్ముగం నేతృత్వంలోని ఒక వర్గం (సుమారు 35 మంది) విజయ్‌కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు, పీఎంకే (4), ఐయూఎంఎల్ (2), సీపీఐ (2), సీపీఎం (2) వంటి పార్టీల మద్దతు కూడగట్టడంపై టీవీకే నేతలు చర్చలు జరుపుతున్నారు.

ప్రస్తుతానికి ఈ 6 మంది ఎమ్మెల్యేల కొరత తీరితే తప్ప విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం లేదు. మే 9న ప్రమాణస్వీకారం చేయాలని టీవీకే భావిస్తున్న తరుణంలో, వచ్చే 24 గంటలు అత్యంత కీలకంగా మారనున్నాయి.

# ఏపీకి రూ.1000 కోట్ల పెట్టుబడి..

ఏపీని పారిశ్రామికంగా, సాంకేతికంగా అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ప్రపంచ ప్రసిద్ధ ఎయిర్ కండిషనర్ల తయారీ సంస్థ 'క్యారియర్ గ్లోబల్' యూనిట్‌కు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కోసం క్యారియర్ సంస్థ సుమారు రూ. 1,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 3,000 మందికి ఉపాధి, జీవనోపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... క్యారియర్ కేవలం ఒక కంపెనీ కాదని, ప్రపంచ శీతలీకరణ సాంకేతికతలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మార్గదర్శి అని ప్రశంసించారు. తన జీవితంలో కొనుగోలు చేసిన మొట్టమొదటి ఏసీ కూడా క్యారియర్ బ్రాండ్‌దేనని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుంటూ, సీఎం చంద్రబాబు నాయుడు తన గదిని ఎప్పుడూ 17 డిగ్రీల సెల్సియస్ వద్ద చల్లగా ఉంచుకోవడానికి ఇష్టపడతారని, ఇప్పుడు ఆ గదిలో కూడా క్యారియర్ ఏసీనే ఉందని లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. దీంతో సభలో నవ్వులు పూశాయి.

**డేటా సెంటర్ల తయారీ హబ్‌గా ఏపీ**

అనంతరం మంత్రి లోకేశ్ రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలపై తన దార్శనికతను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌ను కేవలం డేటా సెంటర్లను ఆకర్షించే రాష్ట్రంగా కాకుండా వాటికి అవసరమైన పూర్తి తయారీ పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించే హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "మేం కేవలం డేటా సెంటర్లను నిర్మించడం లేదు, వాటికి అవసరమైన పూర్తి వ్యవస్థను ఇక్కడే నిర్మిస్తున్నాం" అని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తీవ్రమైన పోటీ నెలకొని ఉందని, ఈ రేసులో ఏపీ ముందు వరుసలో నిలుస్తుందని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. డేటా సెంటర్లకు అత్యాధునిక కూలింగ్ సిస్టమ్స్, అధిక సామర్థ్యం గల చిల్లర్లు, పవర్ ఎలక్ట్రానిక్స్, ప్రెసిషన్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటివి అత్యంత
కీలకమని, వీటికి అవసరమైన బలమైన సహాయక పర్యావరణ వ్యవస్థను నిర్మించడంపై దృష్టి సారించామని వివరించారు. ఈ బృహత్తర లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను, శ్రీసిటీని ఎంచుకున్నందుకు క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు ఆయన స్వాగతం పలికారు. ఈ పెట్టుబడి రాష్ట్ర డిజిటల్, పారిశ్రామిక అభివృద్ధిని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. క్యారియర్ వంటి సంస్థల రాకతో, డేటా సెంటర్లకు అవసరమైన కీలక పరికరాల తయారీ స్థానికంగానే జరిగి, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంటుందని మంత్రి లోకేశ్ తెలిపారు.

# రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు 17వ ఎస్ఐపీబీ ఆమోదం

- మొదటి పేజి తరువాయి

**ప్రతీ ఒప్పందం గ్రౌండ్ కావాలి**

రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వచ్చిన ప్రతీ ప్రతిపాదనా ఒప్పందంగా మారాలని, కుదుర్చుకున్న ప్రతీ ఒప్పందం పెట్టుబడిగా రూపాంతరం చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఒక పెట్టుబడి, పరిశ్రమ రాష్ట్రానికి వచ్చే విషయంలో అనుమతుల నుంచి శంకుస్థాపన, ప్రారంభోత్సవం వరకు నిర్దేశిత గడువులోగా జరిగేలా చూడాలన్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీల శంకుస్థాపన నుంచి ఉత్పత్తి వరకూ నిర్దిష్టమైన కాలపరిమితిలో జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వపరంగా ఇవ్వాల్సిన అనుమతుల విషయంలో ఒక్క రోజు కూడా జాప్యం జరగకూడదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనుమతుల జారీ విషయంలో ఏపీ బ్రాండ్ సృష్టించాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పెట్టుబడులను ఆకర్షించాలంటే ఇతరుల కంటే మనం ఎలా భిన్నమో ఏపీలో అనుమతులు ఎంత సులభతరమో వారికి చెప్పాలని స్పష్టం చేశారు. ఏపీలో ప్రాజెక్టులు రావాలన్న తపన ఉన్న అధికారులను అనుమతులు ఇచ్చే స్థానాల్లో నియమించాలని సూచించారు.

**వన్ ఫ్యామిలీ – వన్ ఎంట్రప్రెన్యూర్‌లో ఎంఎస్ఎంఈలు కీలకం**

సచివాలయంలో జరిగిన 17వ ఎస్ఐపీబీ సమావేశంలో 25 ప్రాజెక్టులకు చెందిన రూ.2,01,023 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 39,067 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "పెట్టుబడుల విషయంలో భారీ పరిశ్రమలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో ఎంఎస్ఎంఈలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్ విషయంలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషిస్తాయి. అన్ని పారిశ్రామిక ప్రాంతాలకు గ్యాస్ పైప్ లైన్ అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఫుడ్ ప్రాసెసింగ్ లో రంగంలో రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని పెట్టుబడులు గ్రౌండ్ అయ్యేలా చూడాలి. మన రాష్ట్రంలో ఉద్యాన, వాణిజ్య పంట ఉత్పత్తులకు విలువ జోడింపు జరగాలి. ఆయిల్ పాం, మామిడి, కొబ్బరి, కోకో సహా పలు పంటలకు వ్యాల్యూ అడిషన్ ఇస్తే రైతులకు ఎంతో మంచి జరుగుతుంది" అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, మంత్రులు టీజీ భరత్, అచ్చెన్నాయుడు, సుభాష్, వివిధ శాఖల అధికారులు, వర్చువల్‌గా మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

**17వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రతిపాదనల వివరాలు**

**ఇంధన రంగం**

1. రిలయన్స్ ఇండస్ట్రీస్ – శ్రీసత్యసాయి జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టు రూ.51,300 కోట్ల పెట్టుబడులు, 20 వేల మందికి ఉద్యోగాలు
2. క్లీన్ రెన్యూబుల్ ఎనర్జీ హైబ్రీడ్ త్రీ లిమిటెడ్, నంద్యాలలో రూ.155 కోట్ల పెట్టుబడులు, 40 మందికి ఉద్యోగాలు
3. క్లీన్ ఎనర్జీ హైబ్రీడ్ ట్వెల్వ్ లిమిటెడ్ అనంతపురం జిల్లా రూ.779 కోట్ల పెట్టుబడులు, 125 మందికి ఉద్యోగాలు
4. క్లీన్ ఎనర్జీ హైబ్రీడ్ థర్టీన్ లిమిటెడ్ అనంతపురం జిల్లా రూ.779 కోట్ల పెట్టుబడులు 125 మందికి ఉద్యోగాలు
5. అదాని హైడ్రో ఎనర్జీ ఎలెవెన్ కడప జిల్లాలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ రూ. 12,297 కోట్ల పెట్టుబడులు, 3375 మందికి ఉద్యోగాలు
6. యమాన్కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తిరుపతి జిల్లాలో గ్రీన్ హైడ్రోజన్ రూ.9398 కోట్ల పెట్టుబడులు, 5820 మందికి ఉద్యోగాలు
7. అమృత శ్రీ బయో సీఎన్జీ లిమిటెడ్ విజయనగరం రూ.89 కోట్ల పెట్టుబడులు, 402 మందికి ఉద్యోగాలు
8. బాలాజీ బయోఎనర్జీ ఆర్గానిక్స్, నెల్లూరు జిల్లా రూ.59 కోట్ల పెట్టుబడులు, 335 మందికి ఉద్యోగాలు
9. హెచ్ పీసీఎల్ రెన్యూబుల్ గ్రీన్ ఎనర్జీ, ఏలూరు జిల్లా రూ.100 కోట్ల పెట్టుబడులు, 150 మందికి ఉద్యోగాలు
10. ఎనర్జియా బయో ఫ్యూయల్స్ తిరుపతి జిల్లాలో సీబీజీ ప్లాంట్ రూ.59 కోట్ల పెట్టుబడులు, 335 మందికి ఉద్యోగాలు
11. విభా బయో ఫ్యూయల్స్ తూర్పుగోదావరి జిల్లా రూ.67 కోట్ల పెట్టుబడులు, 110 మందికి ఉద్యోగాలు
12. ఐటీసీ జీపీఎస్ రెన్యువబుల్స్ ఎన్టీఆర్ జిల్లాలో సీబీజీ ప్లాంట్ రూ.120 కోట్లు పెట్టుబడులు, 200 మందికి ఉద్యోగాలు,
13. డెల్టా బయోగ్యాస్ పలనాడు జిల్లా రూ. 100 కోట్లు పెట్టుబడులు, 750 మందికి ఉద్యోగాలు

**ఐటీ**

14. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విశాఖలో డేటాసెంటర్ ఏర్పాటు రూ.1,08,010 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు
15. క్యారియర్ ఎయిర్ కండిషనింగ్, తిరుపతి జిల్లాలో బల్క్ చిల్లర్స్ తయారీ రూ.863 కోట్ల పెట్టుబడులు, 721 మందికి ఉద్యోగాలు.
16. ఎన్ఎస్టీఎల్ డీఆర్డీఓ, అమరావతి క్వాంటం వ్యాలీ రూ.22.5 కోట్ల పెట్టుబడి, 20 మందికి ఉద్యోగాలు

**ఫుడ్ ప్రాసెసింగ్**

17. స్నేహా ఫార్మ్స్ లిమిటెడ్ అనంతపురం, అన్నమయ్య జిల్లాలు, రూ,277.94 కోట్ల పెట్టుబడులు, 435 మందికి ఉద్యోగాలు

**పరిశ్రమలు**

18. గ్రిడోన్ ఎనర్జీ లిమిటెడ్, కర్నూలు జిల్లా, రూ.3149 కోట్ల పెట్టుబడులు, 320 ఉద్యోగాలు
19. అపోలో టైర్స్ , తిరుపతి జిల్లా, శ్రీసిటీ రూ,6100 కోట్లు పెట్టుబడులు, 1000 మందికి ఉద్యోగాలు
20. ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్, ఫ్రాగ్రెన్సెస్ ఇఫ్కో సెజ్ నెల్లూరు, రూ.3153 కోట్ల పెట్టుబడులు, 172 మందికి ఉద్యోగాలు
21. రాయల్ ఎన్ ఫీల్డ్ , తిరుపతి జిల్లా, రూ.2508 కోట్ల పెట్టుబడులు, 3 వేల మందికి ఉద్యోగాలు
22. చెట్టినాడ్ సిమెంట్స్ , పలనాడు జిల్లా, రూ.1340 కోట్లు పెట్టుబడులు, 360 మందికి ఉద్యోగాలు
23. ఏఏకె సౌత్ ఈస్ట్ ఇండియా కాకినాడ జిల్లా, రూ.171.52 కోట్ల పెట్టుబడులు, 102 మందికి ఉద్యోగాలు
24. ఐటీసీ లిమిటెడ్, గుంటూరు జిల్లా రూ.51.65 కోట్ల పెట్టుబడులు, 50 మందికి ఉద్యోగాలు
25. హ్యాంగ్యో ఐస్ క్రీమ్స్ తిరుపతి జిల్లా రూ.74.49 కోట్ల పెట్టుబడులు, 110 మందికి ఉద్యోగాలు.

# అలా చేస్తే కేసులు వాపస్: మంగ్లీకి న్యాయవాది సుబ్బారావు కీలక సూచన

మైక్రోఫైనాన్స్ కేసులో గాయని మంగ్లీకి న్యాయవాది సుబ్బారావు కీలక సూచన చేశారు. ఈ కేసులోని బాధితులకు మంగ్లీ, ఆమె సోదరుడు డబ్బులు చెల్లిస్తే కేసులు వాపస్ తీసుకోవడానికి తాము సిద్ధమని స్పష్టం చేశారు. మైక్రోఫైనాన్స్ కేసులో మంగ్లీ ప్రతిసారి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగ్లీతో పాటు ఆమె సోదరుడు శివపై గద్వాల్, గచ్చిబౌలి, నల్గొండలలో కేసులు ఉన్నాయని తెలిపారు.

ఈ కేసులకు సంబంధించి వారు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. మైక్రోఫైనాన్స్ కేసులో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని తాము డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసినట్లు తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా కలుస్తామని అన్నారు. బాధితులకు న్యాయం జరగాలని ఆయన తెలిపారు.మైక్రోఫైనాన్స్ పేరిట అధిక లాభాలు వస్తాయని నమ్మించి మంగ్లీ, ఆమె సోదరుడు సహా మరికొంతమంది కోట్లాది రూపాయల మోసగించారని పలువురు బాధితులు సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది సుబ్బారావును కలిశారు.

ఈ విషయం తెలుసుకోవడానికి సుబ్బారావు సంప్రదించగా, మంగ్లీ బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపిస్తూ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మరోవైపు, తనపై దుష్ప్రచారం చేయడం ద్వారా న్యాయవాది సుబ్బారావు ప్రాచుర్యం పొందాలనుకుంటున్నారని మంగ్లీ అదే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తమిళ రాజకీయాల్లో కొత్త ట్విస్ట్! విజయ్‌కు పోటీగా డీఎంకే, అన్నాడీఎంకే కలుస్తాయా?

- మొదటి పేజి తరువాయి

అన్నాడీఎంకే వర్గాలు ధృవీకరించాయని, కానీ ఫలితం ఏమిటనేది తెలియరాలేదని తెలుస్తోంది.అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే 59, అన్నాడీఎంకే 47 స్థానాలు గెలుచుకున్నాయి. అయితే ఈ రెండు పార్టీలు కలిసినా (106 స్థానాలు) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన సంఖ్యా బలం ఉండదు. ఈ కూటమికి వీసీకే వంటి చిన్న పార్టీల మద్దతు అవసరం. అయితే అన్నాడీఎంకేతో తమకు ఎలాంటి పొత్తు ఉండబోదని డీఎంకే అధికార ప్రతినిధి ఎ.శరవణన్ తెలిపారు.

# ఇరాన్ సహకరించకుంటే మళ్లీ బాంబుదాడులు మొదలవుతాయి

- మొదటి పేజి తరువాయి

జలసంధి తెరుచుకుంటుందని పేర్కొన్నారు.ఇరాన్ నుంచి సహకారం లేకుంటే మునుపటి కంటే భీకరస్థాయిలో, మరింత తీవ్రతతో బాంబు దాడులు ఉంటాయని హెచ్చరించారు. యుద్ధం ముగింపు దిశగా ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యుద్ధాన్ని ముగించేందుకు, మరింత వివరణాత్మక అణు చర్చల కోసం ఫ్రేమ్ వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు రెండు దేశాలు ఓ ఒప్పందానికి చేరువవుతున్నాయంటూ అమెరికా మీడియా సంస్థ ఒకటి తెలిపింది. అణు కార్యక్రమాల తాత్కాలిక నిషేధానికి ఇరాన్ ముందుకు రావడం, హర్మూజ్ జలసంధిలో ఆంక్షలు ఎత్తివేయడం, ఇరాన్‌కు చెందిన నిధుల విడుదలకు అమెరికా అంగీకరించడం వంటివి ఈ ఒప్పందంలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

# మెదక్‌లో దారుణం.. పసికందును రూ.1.50 లక్షలకు అమ్మేసిన నర్సు

మెదక్ జిల్లాలో అత్యంత దారుణమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. పుట్టిన పసికందు చనిపోయిందని తల్లిని నమ్మించిన ఓ నర్సు, ఆ శిశువును రూ.1.50 లక్షలకు విక్రయించింది. ఈ అమానవీయ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

**అసలేం జరిగిందంటే..!**

పాపన్నపేట మండలం లక్ష్మీనగర్ తండాకు చెందిన నస్రా ఫాతిమా సికింద్రాబాద్‌లోని మౌలాలిలో నివసిస్తోంది. ఏడు నెలల గర్భిణిగా ఉన్న ఆమె, ఇటీవల తన అత్తగారింటికి వెళ్లేందుకు మెదక్‌కు వచ్చింది. బస్టాండ్‌లో ఆమె చేతిలోని చిప్స్ ప్యాకెట్‌ను చూసిన కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనతో భయపడిపోయిన ఆమెను స్నేహితురాలు స్థానిక ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యులు శస్త్రచికిత్స చేయగా, ఫాతిమా ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, అదే ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న అక్తరీ బేగం, పుట్టిన పాప చనిపోయిందని ఫాతిమాను నమ్మించింది. నర్సు మాటలు నిజమని భావించిన ఫాతిమా, తీవ్ర దుఃఖంతో మూడు రోజుల తర్వాత ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లింది.

అయితే, ఐదు రోజుల తర్వాత ఓ వ్యక్తి ద్వారా తన పాప బతికే ఉందని ఫాతిమాకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించి, నర్సు అక్తరీ బేగంపై ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# విమర్శించడం తప్ప పేర్ని నానికి బందరు ప్రయోజనాలు పట్టవు

బందరు (మచిలీపట్నం) చరిత్ర తిరగరాసేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు. ఈరోజు బందరులో తాగునీటి పైపులైన్లు, డీడబ్ల్యూఎమ్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఆయన... ప్రతి ప్రాంతానికి రోడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కేవలం విమర్శలకే పరిమితమైన మాజీ మంత్రి పేర్ని నానికి బందరు ప్రయోజనాలు పట్టవని మండిపడ్డారు. అభివృద్ధి పనులను ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 28 లక్షలతో పనులు చేపడుతున్నామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో బందరు రూపురేఖలు మారుస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందకుండా చేసిందని, కరగ్రహారం లేఅవుట్ పేరుతో భూములను తక్కువకు కొని ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మి దోచుకున్నారని ఆరోపించారు. ఇనుము దొంగతనంపై పేర్ని నాని చేస్తున్న ఆరోపణలను కొట్టిపారేస్తూ, నిరుపయోగంగా ఉన్న ఇనుమును ప్రజల అవసరాల కోసం వినియోగించడంలో తప్పులేదని మంత్రి స్పష్టం చేశారు.

# రైతులకు వేగంగా విత్తన సరఫరా చేయాలి

- మొదటి పేజి తరువాయి

కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. అరటి, ఆయిల్ పామ్, మిర్చి, కోకో లాంటి పంటలకు సంబంధించి ధరల సమస్య లేదని రైతులకు మంచి ధర లభిస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీజన్ కంటే ముందే రాష్ట్రంలోని నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వచ్చే పంట సీజన్ కు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. నాఫెడ్ నుంచి మినుములు ఇతర వాణిజ్య పంటల్ని కొనుగోలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రికి వివరించారు. పీఎండీఎస్ పథకం ద్వారా తక్కువ యూరియా వినియోగానికి ఇచ్చే ప్రోత్సాహకం పై కేంద్రంతో మాట్లాడాలని వారికి సూచించారు. మదనపల్లె లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి అన్నారు.

# పెన్ పవర్

## సెంట్రల్ ఆంధ్ర

కృష్ణా జిల్లా . ఎన్.టి.ఆర్. జిల్లా . గుంటూరు జిల్లా . పల్నాడు జిల్లా . బాపట్ల జిల్లా


# గుంటూరులో రోడ్డు భద్రత, డ్రైనేజీ సమస్యల పై ఎమ్మెల్యే గళ్ళా మాధవికి ఫిర్యాదు చేసిన ప్రజలు...





గుంటూరు, పెన్ పవర్, మే, 06, ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి బుధవారం టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమానికి పార్టీ నాయకులతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యంగా నగరంలోని రహదారి భద్రత, మౌలిక సదుపాయాలు, డ్రైనేజీ, పెన్షన్లు మరియు ఉపాధి సంబంధిత సమస్యలపై పలు వినతులు అందాయి. ప్రధానంగా కోరిటెపాడు--అమరావతి రోడ్ కూడలి వద్ద ప్రమాదకరమైన రోడ్డు వాలు కారణంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని, ఈ సమస్యను తక్షణమే సరిచేయాలని కోరారు. అదేవిధంగా, నగరంలో ఏర్పాటు చేసిన అనేక స్పీడ్ బ్రేకర్లు ఐ ర్ సి ప్రమాణాలకు అనుగుణంగా లేవని, అనధికారికంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలకు దారితీస్తున్నాయని తెలియజేశారు. వీటిని తొలగించి, ప్రమాణాలకు అనుగుణంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థలు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల ప్రధాన కూడళ్లలో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, వీటిని వెంటనే సరిచేయాలని కోరారు. ఇటీవల నిర్మించిన రోడ్లలో మురుగునీటి పారుదల వ్యవస్థలు సరైన స్థాయిలో లేకపోవడం వల్ల వర్షాకాలంలో సమస్యలు తలెత్తుతున్నాయని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. ఎస్వీయన్ కాలనీ మెయిన్ రోడ్, అశోక్ నగర్‌లోని శివలీల అపార్ట్‌మెంట్ వాసులు తమ ప్రాంతంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. రామన్నపేట 1వ లైన్ 5వ అడ్డరోడ్డులో కాలువలు నిర్మించి, రోడ్డు వేయాలని స్థానికులు కోరారు. ఏటి అగ్రహారంకు చెందిన మాలపాటి ప్రియాంక తనకు కలెక్టరేట్‌లో ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సత్యనారాయణపురంకు చెందిన సిహెచ్ రమణయ్య డ్రైనేజీ మరియు వాటర్ పైప్‌లైన్ సమస్యలపై ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావుపేటకు చెందిన షేక్ ఖాసీంవలి తనకు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరగా, చామర్తి అనురాధ అనే మహిళ తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను గుర్తించి పరిష్కారాలు అందించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. గ్రీవెన్స్ కార్యక్రమం ప్రజలకు తమ సమస్యలను నేరుగా చెప్పుకునే వేదికగా నిలుస్తుందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# విజయవాడ ఆర్డీవోగా వెన్నెల శ్రీను...






విజయవాడ, పెన్ పవర్, మే, 06, విజయవాడ నూతన రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్డీవో) వెన్నెల శ్రీను బుధవారం నగరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. రెవెన్యూ సేవలతో పాటు ప్రజలకు అత్యంత పారదర్శకంగా పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అందించడంలో ప్రత్యేక ముద్ర వేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా క్షేత్రస్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తించాలని సూచిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు...

# ఒక్క ఓటు తో గెలుపు, ఓటముల గురించి ఎన్నికల ముందు మాట్లాడిన బిజెపి అసెంబ్లీ ఇంచార్జ్ కొక్కెర శ్రీనివాస్..



గుంటూరు, పెన్ పవర్, మే, 06, బిజెపి జాతీయ పార్టీ పంపిన అసెంబ్లీ ఇంచార్జ్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బిజెపి నాయకుడు కొక్కెర శ్రీనివాస్ తిరుపత్తూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల ఇంచార్జ్‌గా జాతీయ నాయకత్వం ద్వారా నియమించబడ్డారు. ఆయన మార్చి 6వ తేదీ నుండి తిరుపత్తూరులోనే ఉండి, నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను నిరంతరం కలుస్తూ అనేక సమావేశాలు నిర్వహిస్తూ అందరినీ ఎన్నికలకు సిద్ధం చేశారు. ఈ కాలంలో ఆయన నిరంతరం "ఒక్క ఓటు" ప్రాధాన్యతను వివరించి, ప్రతి కార్యకర్తకు అవగాహన కల్పించారు. ప్రతి సమావేశంలో "ఒక్క ఓటు రాజకీయ విధిని మార్చగలదు", "ఒక్క ఓటు గెలుపును నిర్ణయిస్తుంది", "ఈ ఒక్క ఓటు చరిత్రను మార్చగలదు" అని పలుమార్లు స్పష్టంగా చెప్పారు. ఈ సన్నాహం ద్వారానే బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున రెండు నెలల నుండి విస్తృతంగా గ్రామాల్లో ఒక్కవోటు కూడా అత్యంత కీలకమని భావించి సర్వ సన్నద్ధం అయ్యారు, వారి కృషి వలన ఓట్లు పెద్ద ఎత్తున బిజెపి కి పోలయ్యేటట్లు విశ్వ ప్రయత్నాలు చేశారు అదేవిధంగా మిత్రపక్షాలైన అన్నాడిఎంకె మరియు ఇతర మిత్రపక్షాల సమావేశాల్లో కూడా "ఒక్క ఓటు" ప్రాముఖ్యతను అనేక ఉదాహరణలతో వివరించారు. మార్చి 6 నుండి ఏప్రిల్ 25 వరకు 45 రోజులపాటు ఎన్నికల ఇంచార్జ్‌గా పనిచేసిన ఈ కాలంలో ఆయన ఇదే అంశాన్ని ప్రధానంగా ముందుకు తీసుకువెళ్లారు.ఆ తరువాత మే 4న వెలువడిన ఎన్నికల ఫలితాల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా తిరుపత్తూరులో మాత్రమే ఒక్క ఓటు తేడాతో డీమకే మంత్రి ఓడిపోవడం, అదే ఒక్క ఓటుతో టీవీకే పార్టీ గెలుపొందడం జరిగింది. ఈ సంఘటన ప్రస్తుతంతిరుపత్తూరులో అన్ని రాజకీయ పార్టీల మధ్య ప్రధాన చర్చగా మారింది. బిజెపి జాతీయ పార్టీ నుండి వచ్చిన ఇంచార్జ్ "ఒక్క ఓటు" గురించి పదేపదే చెప్పిన విషయాన్ని ఇప్పుడు అందరూ గుర్తుచేసుకుంటున్నారు. మా ఇంచార్జ్ అప్పట్లో చెప్పినప్పుడు దాని అర్థం పూర్తిగా అర్థం కాలేదు. కానీ ఆయన చాలా స్పష్టంగా, అనేక సార్లు 'ఒక్క ఓటు' గురించి చెప్పడం ఇప్పుడు మాకు ఆశ్చర్యంగా ఉంది" అని అక్కడి బిజెపి నాయకులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు.దీనివల్ల బిజెపి ముందుగానే పరిస్థితిని ఎంత ఖచ్చితంగా అంచనా వేసిందనే అంశంపై చర్చ జరుగుతోంది. కొక్కెర శ్రీనివాస్ మాటలు ఇప్పుడు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చర్చ అవుతున్నాయి...

# ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 50వ రోజు కొనసాగుతున్న యూత్ టైం బ్యాంక్ సేవలు...






విజయవాడ, పెన్ పవర్, మే, 06, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశా ఐఏఎస్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యూత్ టైం బ్యాంక్ సేవలు 50వ రోజు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్విరామంగా కొనసాగుతున్నాయని యువజన సర్వీసుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యనిర్వాహణాధికారి మరియు ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సిబ్బంది కొరత రీత్యా యూత్ టైం బ్యాంక్ సర్వీసులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టితో మార్చి 16వ తేదీన ప్రారంభించారు. అప్పటినుండి ఈరోజు వరకు నిర్విరామంగా యూత్ టైం బ్యాంక్ సేవలు రోజుకి ఒక కాలేజ్ చొప్పున 30 నుంచి 40 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థులు టైం బ్యాంక్ సేవలో పాల్గొని వయోవృద్ధులకు, వికలాంగులకు, నడవలేని వారికి మరియు నిరక్షరాస్యులకు వారు హాస్పిటల్ ఆవరణంలోకి వచ్చిన వెంటనే వారికి ఓపిడి తీసి ఇవ్వడం, డాక్టర్ ను సంప్రదించడం, టెస్టులు చేయించడం మందులు తీసి ఆటో ఎక్కిచ్చేంత వరకు పేషెంట్ కి యూత్ టైం బ్యాంకు వాలంటీర్లు తోడుగా ఉండి వారికి వెచ్చించిన టైంను యూత్ టైం బ్యాంకులో నమోదవుతుంది. ఈ రోజు ఎస్ ఆర్ కె ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు ఎస్ ఆర్ ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్, ఎన్జీవో క్యాంపస్ నావిగేషన్ వాలంటీర్లు మరియు వాసవి మహిళా మండలి వాలంటీర్లు వాలంటీర్లు 65 మంది సేవలు అందించారు. ఈ సేవలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేసినవారికి కలెక్టర్ మెరిట్ సర్టిఫికెట్ కూడా ఇస్తున్నారు. ఇలాంటి సేవలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని ఎన్జీవోలు భాగస్వామ్యం పొందాలని మరియు డిగ్రీ విద్యార్థులు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు, ఇంటెన్షిప్, అప్రియెంటెన్షిప్ చేయదలచుకున్న వారు యూత్ టైం బ్యాంకు ఉపయోగించుకోవాలని వారి పని గంటలు పూర్తి అయిన తర్వాత వారికి కలెక్టర్ చే సర్టిఫికెట్ ఇస్తామని, ఈ సేవలు ఉపయోగించుకోవడం వల్ల పేషంట్లకు, కళాశాలకు, జిల్లాకు మంచి పేరు వస్తుందని యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. 50 రోజులలో ఈ సేవలను 1682 మంది వాలంటీర్లు, 3901 మంది పేషెంట్లకు మరియు 6448 గంటలు సేవలందించారు. ఈ సేవలను చేయదలుచుకున్నవారు ముఖ్యకారినిర్వాహణాధికారి, యువజన సంక్షేమ శాఖ ఎన్టీఆర్ జిల్లా మొబైల్ నెంబర్ ను 9849909069 సంప్రదించవచ్చని తెలిపారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు శరవేగంగా ఏర్పాట్లు...

## జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు..





విజయవాడ, పెన్ పవర్, మే, 06, ఈ నెల 9వ తేదీన ఎ.కొండూరు మండలం మాధవరంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని.. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక స్వర్ణ గ్రామం కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్ తో కలిసి రెవెన్యూ, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, వ్యవసాయం, ఉద్యానం, రవాణా, సర్వే, పోలీసు తదితర సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రీసర్వే పూర్తయిన భూముల రైతులకు రాజముద్రతో పట్టాలు అందించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని.. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. కార్యక్రమ వేదిక, అతిథులు కూర్చునే ఏర్పాట్లు, ప్రజల కోసం తగిన షేడ్లు, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లు, పారిశుధ్యం వంటి అంశాల్లో ఎలాంటి లోటు ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వీఐపీ రాకపోకల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మార్గమధ్యంలో తగిన సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. వాస్తవ ప్రగతిని ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరోగ్య శాఖ అధికారులు అత్యవసర వైద్య సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఫైర్ సర్వీసులు, విపత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమ ప్రాంగణంలో సూచిక బోర్డులు, దిశా నిర్దేశకాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం కార్యక్రమం జరిగే ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను త్వరితగతిన ఏర్పాట్లను పూర్తిచేసేలా దిశానిర్దేశం చేశారు...

# జనాభా గణన 2027లో వివరాలు నమోదు ప్రతి పౌరుని కనీస భాధ్యత... కమిషనర్ కె.మయూర్ అశోక్..



గుంటూరు, పెన్ పవర్, మే, 06, గుంటూరు నగరంలో జనాభా గణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజలు ఇచ్చే వ్యక్తిగత సమాచారం చాలా సురక్షితంగా ఉంటుందని, ఎటువంటి అపోహలకు గురికావద్దని, జన గణనపై సందేహాలకు జిఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు పని చేసేలా కాల్ సెంటర్ 0863-2345105 ఏర్పాటు చేశామని గుంటూరు నగర ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి మరియు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 3 చార్జీల్లో (3 నియోజకవర్గాలు) ఈ నెల 1వ తేదీ నుండి జన గణనలో భాగంగా తొలి దశ ఇళ్ల గణన ప్రారంభమైందని, దీనికోసం 1272 మంది ఎన్యుమరేటర్లను, 201 సూపర్వైజర్లను, ముగ్గురు ఛార్జ్ అధికారులను నియమించామన్నారు. ఇళ్ల గణన మే 1వ తేదీ నుంచి మే 30వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు వారి ఐడీ కార్డులను పరిశీలించి వివరాలు తెలియజేయాలని సూచించారు. కొందరు అపోహలకు గురై ఎన్యుమరేటర్లకు తగిన సమాచారం ఇవ్వడం లేదని తమ దృష్టికి వచ్చిందని, ప్రజలు ఇచ్చే వ్యక్తిగత సమాచారం చాలా సురక్షితంగా ఉంటుందని, సరైన సమాచారం ఇవ్వడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన తదితర ప్రణాళికలు రూపొందించడానికి వీలవుతుందన్నారు. గృహ గణనలో 33 నిర్దిష్ట ప్రశ్నలు ఉంటాయని, ప్రధానంగా ఇంటి వివరాలు, ఎల్పీజీ, టాయ్ లెట్స్, విద్యుత్, ట్యాప్ కనెక్షన్ వంటి మౌలిక వసతులు, టీవీ, వాహనం, సెల్ ఫోన్, ఇంటర్ నెట్ వంటి గృహోపకరణాలు, ఫోన్ నంబర్ వంటి వివరాలు మాత్రమే అడుగుతారని, ఓటీపీ, ఆధార్, పాన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్, యుపిఐ పేమెంట్ అంశాలను, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎన్యుమరేటర్లు అడగరని స్పష్టం చేశారు. స్వీయ నమోదు చేసుకున్న వారు జనగణనకు వచ్చే సిబ్బందికి తమ సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడిని తెలపాలని సూచించారు.

# బాలల హక్కులు లైంగిక వేధింపులు,చైల్డ్ అడ్వొకసీ కౌన్సిలింగ్..గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్..






గుంటూరు, పెన్ పవర్, మే, 06, తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో బుధవారం సాయంత్రం గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థవారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాలల హక్కులు, లైంగిక వేధింపులు,చైల్డ్ అడ్వొకసీ కౌన్సిలింగ్ గురించి చైతన్య బాలల పార్లమెంట్ గ్రూప్ లో వర్క్ షాప్ నిర్వహించటం జరిగినది. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి కో ఆర్డినేటర్ సిస్టర్ విద్యా మాట్లాడుతూ బాలలకు ఉన్న హక్కులు, చట్టాలు,న్యాయా సహాయం ఎలా అందుతుంది లాంటి విషయాలు గురించి గ్రూప్ సభ్యులకు తెలియజేయడం జరిగింది,అందులో భాగంగా బాలల న్యాయవాద మండలాలు అనేవి సమాజ ఆధారిత సంస్థలు,ఇవి వేధింపులకు గురైన పిల్లలకు సురక్షితమైన,అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తాయని వారు కోలుకోవడానికి సహాయ పడతాయని మరియు నేరస్థులను జవాబుదారీగా ఉంచడానికి పోలీసులు, ప్రాసిక్యూటర్లు మరియు కౌన్సిలర్ల సేవలను ఇవి సమన్వయం చేస్తాయని బహుళ-విభాగాల విధానం ద్వారా,చిన్న వయస్సులో ప్రాణాలతో బయటపడిన వారిలో మానసిక ఆఘాతాన్ని తగ్గించడంపై ఇవి దృష్టి పెడతాయని వీటి ముఖ్య విధులలో తరచుగా ప్రాణాలతో బయటపడిన వారిలో మానసిక ఆందోళన తగ్గించడంపైదృష్టి పెడతాయని అలానే వీటి ముఖ్య విధులలో తరచుగా చైల్డ్ అడ్వొకసీ సెంటర్ అనేది పిల్లలకు అనుకూలమైనఒక కేంద్రం,ఇదిఒక తటస్థమైన, సురక్షితమైన ప్రదేశం,ఇక్కడ చట్టాన్ని అమలు చేసే అధికారులు,పిల్లల సంరక్షణ సేవలు,మరియు వైద్య నిపుణులతో కూడిన బహుళ-విభాగాల బృందాలు, ఉంటాయనిపునఃవిచారణను తగ్గించడం ద్వారా మానసికపరిస్థితి మెరుగు పరిచే లక్ష్యంతో,పిల్లలపై జరిగే దుర్వినియోగంపై దర్యాప్తులను సమన్వయం చేస్తాయని తెలిపారు. తరువాత సిబ్బంది లిఅత్తోట పోతురాజు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల ఒప్పందం ప్రకారం, 18 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ప్రధానంగా 4 రకాల ప్రాథమిక హక్కులు కల్పించింది అని ఈ హక్కులు పిల్లల శారీరక, మానసిక, మరియు సామాజిక వికాసానికి అవసరమైన కనీస రక్షణను కల్పిస్తాయని బాలల హక్కులను ప్రోత్సహించడం అంటే వారి మనుగడ, అభివృద్ధి మరియు భాగస్వామ్యంపై దృష్టి సారిస్తూ బాలల హక్కులను పరిరక్షించడమే అని పిల్లల న్యాయవాది కార్యాలయం అనేది పార్లమెంట్ ఏర్పాటు చేసిన ఒక కమిషన్,ఇది పిల్లలందరి హక్కులను, శ్రేయస్సును పరిరక్షించడానికి, అమలు చేయడానికి ఏర్పాటు చేయబడిందని 2006లో బాలల సంరక్షణ మరియు రక్షణ చట్టం (2004) కింద స్థాపించబడిందని, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా,6 నెలలుగా ఎవరూ సందర్శించని పిల్లల కేసులను 24-48 గంటల్లో సమీక్షించాలని, నిరంతర పర్యవేక్షణ అవసరమని. ఈ కేంద్రాలు పిల్లల రక్షణ, న్యాయం మరియు బాధితుల మద్దతును సమన్వయం చేస్తూ, వారి హక్కుల కోసం పనిచేసే కీలక సంస్థ అని పరిశోధన మరియు డాక్యుమెంటేషన్ ప్రయత్నాలు బాలల హక్కులపై సమగ్ర అవగాహనను పెంచటం, పిల్లల హక్కులను ప్రభావితం చేసే ఆందోళన కలిగించే ప్రభుత్వ,ప్రభుత్వేతర సంస్థల గురించి తెలియజేసి, పిల్లలతో గ్రూప్ వర్క్ షాప్ నిర్వహించటం జరిగినది. ఈ కార్యక్రమం లో చైతన్య బాలల పార్లమెంట్ గ్రూప్ సభ్యులు, కిశోర బాలికల గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

# నరసరావుపేటలో కుండపోత వర్షాన్నీ లెక్కచేయని ఎమ్మెల్యే

## పారిశుధ్య పనుల్లో స్వయంగా పాల్గొన్న డాక్టర్ చదలవాడ అరవింద బాబు





నరసరావుపేట, పెన్ పవర్ మే 6: పదవి అంటే అధికారం కాదు, బాధ్యత అని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మరోసారి నిరూపించారు. బుధవారం నగరంలో కుండపోత వర్షం కురుస్తున్నా వెనకడుగు వేయకుండా ఆయన క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. రెయిన్ కోట్ ధరించి రోడ్లపైనే ఉండి సిబ్బందిలో ధైర్యం నింపారు. నగరంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో మునిపాలిటీ శానిటేషన్ సిబ్బందితో పాటు ఎమ్మెల్యే స్వయంగా పాల్గొన్నారు. వరుసగా రెండో రోజు కొనసాగుతున్న ఈ డ్రైవ్‌లో వర్షం అడ్డంకిగా మారినా పనులు ఆగకుండా చర్యలు తీసుకున్నారు. వర్షంలో తడుస్తూనే మురికి కాలువలు, రోడ్లపై నిలిచిన నీరు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. సిబ్బందికి తగిన సూచనలు ఇస్తూ పనులను వేగవంతం చేయించారు. ప్రజల ఆరోగ్యమే పరమావధిగా భావించి వానలోనూ పట్టుదల వీడలేదు. నాయకుడు ముందుండి నడిపిస్తే ఏ కష్టమైనా తేలికే అన్నట్టుగా డాక్టర్ అరవింద బాబు వ్యవహరించారు. ఆయన అంకితభావం చూసి పారిశుధ్య సిబ్బంది మరింత ఉత్సాహంగా పనిచేశారు. వర్షం కారణంగా ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించి నగరాన్ని శుభ్రంగా ఉంచడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు అధికారులు తెలిపారు. వ్యాధులు రాకుండా ఉండాలంటే స్వచ్ఛతే ప్రధానమని నమ్మి మాటల కంటే చేతల్లో చూపిస్తున్న ఎమ్మెల్యే సేవను స్థానికులు అభినందిస్తున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినా ప్రజాక్షేమం కోసం ముందుకు సాగుతున్న డాక్టర్ చదలవాడ అరవింద బాబు నాయకత్వం నరసరావుపేట నియోజకవర్గానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని

## కిచెన్ గార్డెన్ లను ప్రోత్సహిస్తూ 84,000 మంది డ్వాక్రా మహిళలకు విత్తనాల పంపిణీ.. జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా





నరసరావుపేట, పెన్ పవర్ మే 06: పల్నాడు జిల్లా వ్యాప్తంగా గురువారం స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వెల్లడించారు. బుధవారం నాడు కలెక్టర్ మాట్లాడుతూ రేపటి నుండి వారం వరకు స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా కిచెన్ గార్డెన్ ల అభివృద్ధికి కృషి చేయనున్నామన్నారు. మండలానికి 3000 మందికి చొప్పున జిల్లా వ్యాప్తంగా 84,000 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు విత్తనాల పంపిణీ చేపట్టనున్నామన్నారు. గ్రామంలో ఔత్సాహికులు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ లు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి మండల స్పెషల్ ఆఫీసర్లు, డీఆర్డీఏ సిబ్బందితో విత్తనాల పంపిణీ చేపడతామన్నారు.

ఆరోగ్యకరమైన జీవితానికి పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడంపై అవగాహన పెంచేందుకు టమోటా, పాలకూర, చుక్కకూర, తోటకూర, బెండ, గోరు చిక్కుడు విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. స్థానిక కలెక్టరేట్ లో నకరికల్లు మండలానికి చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలకు జిల్లా కలెక్టర్ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఝాన్సీ రాణి, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో రూ.లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్

అమరావతి : పెన్ పవర్, మే, 06. విశాఖపట్నంలో లక్ష కోట్ల రూపాయలతో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడి అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (స్టేట్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ బోర్డ్ --ఎస్ఐపిబి) సమావేశంలో ఈ మేరకు ఆ సంస్థ నుండి అందిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. 1,08,010 కోట్ల రుపాయలతో విశాఖలో డేటా సెంటర్‌ను, సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను ఏర్పాటు చేయడానికి కూడా ఆర్ఐఎల్ చేసిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అదే విధంగా కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును, తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి లభించింది.



# మంత్రి నారా లోకేష్‌తో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ భేటీ

## నరసరావుపేట నియోజకవర్గం అభివృద్ధిపై కీలక చర్చలు



నరసరావుపేట, పెన్ పవర్ మే 6: నరసరావుపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు బుధవారం రాజధాని అమరావతిలో మంత్రి నారా లోకేష్ తో భేటీ అయ్యారు. ఈ భేటీలో నియోజకవర్గంలో నెలకొన్న పలు కీలక సమస్యలను, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు పలు వినతిపత్రాలను మంత్రి లోకేష్‌కు సమర్పించారు. నరసరావుపేటలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు, జేఎన్టీయూ కాలేజీకి సంబంధించిన సమస్యల పరిష్కరించాలని కోరారు ఆటో నగర్ అభివృద్ధి, నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులకు నిధులు విడుదల చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూమి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచేలా అధికారులకు సూచనలు ఇవ్వాలని మంత్రిని కోరారు. పార్టీ బలోపేతంతో పాటు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపైనా ఇరువురి మధ్య కీలక చర్చలు జరిగాయి. వినతిపత్రాలను పరిశీలించిన మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు. నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మీడియాతో మాట్లాడుతూ నరసరావుపేట అభివృద్ధే నా ఏకైక లక్ష్యం. మంత్రి లోకేష్ సహకారంతో నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు, నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని వెల్లడించారు.

# విపరీతంగా పెంచిన వంట గ్యాస్ సిలెండర్ ధరలను తగ్గించాలి

## విపరీతంగా పెంచిన కమర్షియల్ గ్యాస్ ధరలను తగ్గించాలి
## గృహానిలకి ఉచితంగా ఇస్తున్న గ్యాస్ సిలెండర్ లను 5కి పెంచాలి
## పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి
## సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్



నరసరావుపేట, పెన్ పవర్ మే 06: నరసరావుపేట స్టేషన్ రోడ్డు ఏంజెల్ టాకీస్ దగ్గర బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో పెంచినటువంటి కమర్షియల్ వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద మధ్య తరగతి ప్రజల పైన మరిన్ని బారాల మోగుతున్నాయని విపరీతంగా గ్యాస్ పెంచుతున్నారని, బడా పారిశ్రామికవేత్తలకులకి రాయితీ లిస్టు పేద ప్రజలను మధ్యతరగతి ప్రజలను దోచుకు తింటున్నారని, కమ్యూనిస్టు పార్టీ చేసే పోరాటాలకి ప్రజల మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పలపాడు రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్, సిపిఐ నాయకులు సిహెచ్ నాగేశ్వరావు, సూర్యా భాస్కర్ సూరి, చందు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ 2027 ఎన్యుమరేషన్ ప్రక్రియపై క్షేత్రస్థాయిలో సమీక్ష -- మున్సిపల్ కమిషనర్ పర్యటన



నరసరావుపేట, పెన్ పవర్ మే 06: దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెన్సస్ 2027 (జనగణన) కార్యక్రమాన్ని వేగవంతం చేయడం లక్ష్యంగా, బుధవారం మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. నగరంలోని పలు డివిజన్లలో జరుగుతున్న ఎన్యుమరేషన్ (జనగణన నమోదు) ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పలు బ్లాకులను సందర్శించి, ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న విధానాన్ని దగ్గరుండి గమనించారు. డేటా ఎంట్రీలో ఎటువంటి తప్పులు చోటుచేసుకోకుండా అత్యంత జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. నిర్దేశిత కాలపరిమితిలోగా ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జనగణన అనేది దేశ అభివృద్ధికి, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు అత్యంత కీలకమైన ప్రక్రియ. ప్రతి పౌరుడు సహకరించి సరైన వివరాలు అందించడం ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి అని కోరారు. ఈ పర్యటనలో కమిషనర్ రమ్య కీర్తనతో పాటు సెన్సస్ నోడల్ అధికారులు, సూపర్వైజర్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వాణిజ్య పన్నుల శాఖ సుస్థిర ప్రగతి... సీఎస్‌కు సంఘాల సమగ్ర నివేదిక...



విజయవాడ, పెన్ పవర్, మే, 06, వాణిజ్య పన్నుల శాఖలో అహ్మద్ బాబు పనితీరుకు ఉద్యోగులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలోని వివిధ సంఘాల ప్రతినిధులు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి శాఖలో నెలకొన్న పరిస్థితులతో పాటు పరిపాలన, అభివృద్ధి అంశాలను సమగ్రంగా వివరించారు. అహ్మద్‌బాబు పనితీరు పట్ల పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. వాణిజ్య పన్నుల శాఖలో అహ్మద్ బాబు బాధ్యతలు స్వీకరించిన అనంతరం అన్ని కేడర్లలో పదోన్నతులు కల్పించడం జరిగిందని.. ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ సెంటర్ ద్వారా పన్నుల వసూళ్లను గణనీయంగా పెంచి రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో శాఖను ముందంజలో నిలిపినట్లు సీఎస్‌కు తెలియజేశారు. శాఖలో పరిపాలన పారదర్శకంగా, సవ్యంగా కొనసాగుతోందని.. ఒక సంఘం తప్ప మిగతా అన్ని సంఘాలు ఏకగ్రీవంగా ప్రభుత్వానికి, ప్రిన్సిపల్ సెక్రటరీ, చీఫ్ కమిషనర్ కు ఇదే విషయాన్ని వివరించినట్లు తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొంతమంది ఉద్యోగులు, అధికారులను ఇబ్బందులకు గురిచేస్తూ శాఖ ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నించడాన్ని అన్ని సంఘాలు ముక్తకంఠంతో ఖండించాయి. తల్లి లాంటి వాణిజ్య పన్నులు శాఖను రోడ్డుమీదకు తీసుకురావడం వంటి చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ సందర్భంగా వాణిజ్య పన్నుల శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు తోట రాజశేఖర్, ఎస్సీ ఽ ఎస్టీ ఎంప్లాయీస్ సంఘం అధ్యక్షులు నిర్మల జ్యోతి, జీఎస్టీ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పురుషోత్తమ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల కళ్యాణ్ కుమార్, ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కన్వీనర్ రాజ్యలక్ష్మి, ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. వేణుగోపాల్ పాల్గొన్నారు.

# నాయుడుపేట శ్రీ పోలేరమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ...





నాయుడు పేట, పెన్ పవర్, మే 6 నాయుడుపేట పట్టణంలో బుధవారం అంగరంగ వైభవంగా జరిగిన గ్రామదేవత శ్రీ పోలేరమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పార్థసారథి దంపతులు,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అమృత సరళ దంపతులు పోలేరమ్మను దర్శించుకుని పూజలు చేసి,మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ రఫీ, నాయుడుపేట మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ,తెలుగుదేశం పార్టీ నాయకులు నెలవల రాజేష్,కట్టా వెంకటరమణారెడ్డి,పొట్లపూడి రాజేష్,అవధానం సుధీర్,గూడూరు సుధీర్ రెడ్డి,నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,పలుకూరు ముత్యాలయ్య కాపులూరు చక్రపాణి,ఆకుల కుబేరు మణి,జువ్వలపాటి మస్తాన్,బల్లి ముత్యాలయ్య,ఎండోమెంట్ ఈవో కే నవీన్ కుమార్,ఆలయ కమిటీ సభ్యులు వినుకొండ ధనంజయ,నిత్య కృష్ణారెడ్డి,హైమావతి,ఆబోతుల బాబు,బాలు శెట్టి,పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# మత్స్యకార భరోసా కార్యక్రమానికి సీఎం రాక...

## తుమ్మలపెంటలో అధికారులతో కలిసి స్థల పరిశీలన చేసిన.. కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి..









కావలి: పెన్ పవర్( స్టాఫ్ రిపోర్టర్ ) మే 6: ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర వేట నిషేధ సమయంలో జీవనోపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మత్స్యకార భరోసా' పథకం కింద ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ఏటా రూ.20,000 ఆర్థిక సాయం అందజేస్తోంది. ఈ పథకం ద్వారా వేలాది మత్స్యకార కుటుంబాలు ఉపశమనం పొందుతున్నాయి.ఈ నేపథ్యంలో 'మత్స్యకార భరోసా' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19వ తేదీన కావలి రూరల్ మండలం తుమ్మలపెంట గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా హాజరుకానుండటం ప్రాంత మత్స్యకారుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.కార్యక్రమ ఏర్పాట్లను సమీక్షించేందుకు కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుతో పాటు అన్ని శాఖల అధికారులతో కలిసి తుమ్మలపెంట గ్రామాన్ని సందర్శించారు.సభా ప్రాంగణం,పార్కింగ్, తాగునీరు, భద్రత, రవాణా వంటి ఏర్పాట్లను పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మత్స్యకారులను ఉద్దేశించి మాట్లాడుతూ... గంగపుత్రులు సముద్ర వేట నిషేధ సమయంలో ఆదాయం లేక ఇబ్బందులు ఎదుర్కొనే మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సంక్షేమాన్ని ముఖ్యంగా పరిగణిస్తూ ఈ 'మత్స్యకార భరోసా' పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ నెల 19న సీఎం గారు స్వయంగా తుమ్మలపెంటకు విచ్చేసి మత్స్యకారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటారని, ప్రతి ఒక్కరి కష్టాలను అర్థం చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. మత్స్యకారుల జీవనోపాధి, అభివృద్ధి, సంక్షేమంపై ముఖ్యమంత్రి మరింత స్పష్టమైన సందేశాన్ని ఇవ్వబోతున్నారని వెల్లడించారు. తుమ్మలపెంట గ్రామానికి సీఎం రాక మత్స్యకారులకు గౌరవకారణమని,అందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గారు పిలుపునిచ్చారు. ప్రభుత్వం మీ పక్షాన నిలుస్తోందని, మీ సమస్యలు పరిష్కరించడానికి కట్టుబడి ఉందని ఆయన భరోసా ఇచ్చారు.మత్స్యకారులు కూడా సీఎం రాకపై ఆనందం వ్యక్తం చేస్తూ, తమ సమస్యలు నేరుగా వినిపించే అవకాశం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మత్స్యకారులకు మరింత మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమం పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు..ఈ పరిశీలన కార్యక్రమంలో కావలి ఆర్డిఓ ఎలీషా,కావలి డీఎస్పీ వి.వి.రమణ కుమార్,కావలి ఎమ్మార్వో శ్రావణ్ కుమార్, కావలి రూరల్ మండలం టిడిపి ఆవుల రామకృష్ణ, సోమశిల మాజీ చైర్మన్ కండ్లగుంట మధు బాబు నాయుడు,అధికారులు, ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కావలి మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నత అధికారులు దృష్టి సారించాలి. ప్రతిపక్షాలు వినతి.



కావలి పెన్ పవర్: కావలి పట్టణంలో కావలి మున్సిపాలిటీలో రోజురోజుకి అవినీతి అక్రమాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వెల్లువిరిస్తున్నట్లు సమాచారం. వివరాల్లోకెళ్తే కావలి మున్సిపాలిటీ గ్రేడ్ వన్ కావడంతో ప్రభుత్వం కొన్ని ప్రత్యేక అధికారాలు ఈ మున్సిపాలిటీకి ఇవ్వబడ్డాయి. దీనివలన అధికారులు సిబ్బంది ఎవరి చేతి వాటం వారు చూపిస్తున్నారు. దీని అంతటికి వెనుకాల ఉన్నది ప్రజాప్రతినిధు లేనని, ప్రజలు ప్రతిపక్షాలు తమ వాదనను వినిపిస్తున్నాయి. కావలి పట్టణంలో ఎక్కడ చూసినప్పటికీ ఒకే చర్చ వినబడుతుంది. అదే కావలి మున్సిపాలిటీ పాలన గాడి తప్పిందని రెవెన్యూ సంబంధించిన అధికారులు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తుంటే సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు..దీని అంతరి ఏమిటి అనేది ప్రజలకు అర్థం కాని ప్రశ్న ఇంత జరుగుతున్నప్పటికీ కూడా మౌనం ఎలా వహిస్తున్నారు? దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని ఇక్కడ జరుగుతున్న అక్రమ లావాదేవులు అక్రమాలు అక్రమ కట్టడాలు పూర్తిగా అవినీతిలో మునిగిపోయినట్లు సమాచారం. ఇటీవల ఒక రెవిన్యూ అధికారి తన చేస్తున్న అసాంఘిక కార్యకలాపాలపై సోషల్ మీడియాలోనూ పత్రికల్లోనూ వచ్చినప్పటికీ దానిపై నివారణ చర్యలు ఏవి అని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. ఒక ప్రక్క రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవినీతి రహిత పాలన నిర్వహించాలని ప్రతి టెలికాన్ఫరెన్స్లో అధికారులతో చెపుతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నట్లు సమాచారం. ఇప్పటికైనా కావలి ఎన్ డి ఏ కూటమి ఎమ్మెల్యే కానీ కలెక్టర్ గాని ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై జరుగుతున్న అక్రమాలపై నిగ్గు తేల్చాలని కోరుతున్నారు.

# మామిడి రైతులను ఆదుకోండి : సిపిఐ నేతల బృందం విజ్ఞప్తి

తవణంపల్లి (చిత్తూరు) : పెన్ పవర్, మే, 06.అకాల వర్షాలు, బలమైన గాలుల ధాటికి తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం అరగొండ గ్రామంలోని రైతు వేణుగోపాల్ నాయుడుకు చెందిన మామిడి తోటను బుధవారం సిపిఐ బృందం పరిశీలించింది. ప్రకృతి ప్రకోపానికి నేలపాలైన మామిడి కాయలను చూసి నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి శివారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మునిరత్నం నాయుడు మాట్లాడుతూ .... గత రెండు రోజులుగా వీచిన బలమైన గాలులకు జిల్లాలోని అనేక మండలాల్లో మామిడి తోటలు దారుణంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా తవణంపల్లి, ఐరాల, యాదమరి, బంగారుపాళెం, వెంకటగిరికోట, పలమనేరు, పూతలపట్టు, పెనుమూరు, కార్వేటినగరం, గంగాధరనెల్లూరు తదితర మండలాల్లో వందలాది ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలాయని వివరించారు. దాదాపు 30 శాతం పంట నేలపాలైందని, కనీసం రాలిన కాయలనైనా అమ్ముకుందామనుకుంటే మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి కిలో కేవలం ఒక రూపాయికి మాత్రమే కొనుగోలు చేయడం అత్యంత దారుణమని వారు మండిపడ్డారు. ఇది రైతులను నిలువునా ముంచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శ్రీ సిటీ ఎలిప్యాడ్ వద్ద మంత్రి నారా లోకేష్ కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ...



సూళ్లూరుపేట, పెన్ పవర్, మే 6 శ్రీ సిటీ ఎలిప్యాడ్ వద్దకు చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఘన స్వాగతం పలికారు.శ్రీ సిటీలో 1000 కోట్ల రూపాయల పెట్టుబడులతో నిర్మిస్తున్న క్యారియర్ ఏసీ పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బుధవారం విచ్చేశారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఓ పుష్పం అందజేసి, ఘన స్వాగతం పలుకుతూ.. శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా అనేక పరిశ్రమలను తీసుకువచ్చి,ఉద్యోగ ఉపాధి కల్పనకు అవిరళ కృషి చేస్తున్న మంత్రి నారా లోకేష్ సేవలను ఎమ్మెల్యే కొనియాడారు.

# నకిలీ ఓటర్ల తొలగింపులో సంపూర్ణ పారదర్శకత పాటించాలి



పలమనేరు,పెన్ పవర్, మే 06, నకిలీ ఓటర్ల తొలగింపులో సంపూర్ణ పారదర్శకత పాటించాలని బీజేపీ నాయకులు సూచించారు. బుధవారం భారతీయ జనతా పార్టీ పలమనేరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు సంబంధించిన యస్.ఐ.ఆర్. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమావేశంను పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపం నందు పట్టణ అధ్యక్షులు వంశీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ మరియు జిల్లా కార్యదర్శి జి.ఆర్. ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రతి 20సంవత్సరాలకు ఒక్క సారి జరిగే ప్రత్యేక సమగ్ర సవరణలో తొలగించే ఓట్లు అనగా చనిపోయిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లు, పర్మినెంట్ మైగ్రేట్ ఓట్లు, అసలు మనుషులే లేని పేర్లతో ఉన్న ఓట్లను మాత్రమే తొలగిస్తారని అన్నారు.అలాగే బి.యల్.ఓ లకు సరైన సమాచారం ఇచ్చి వారికి సహకరించాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కవితా రాజు,జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షులు సయ్యద్ ముబారక్, 6మండలా అధ్యక్షులు, బిఎల్ఏ 2లు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కానూరులో అనుమానిత టి బి లక్షణాలు గల వారికి ఎక్స్ -రే పరీక్షలు







పెళ్లకూరు, పెన్ పవర్, మే 6 ప్రధానమంత్రి టి బి ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమం లో భాగంగా పెళ్ళకూరు మండల పరిధిలోని కానూరు గ్రామంలో బుధవారం జిల్లా టి బి నియంత్రణ అధికారి డాక్టర్ శైలజ ఆదేశాలతో, చెంబేడు వైద్యాధికారి టి చంద్రమోహన్ రెడ్డి పర్యవేక్షణలో కానూరు గ్రామ సచివాలయంలో టి బి లక్షణాలున్న అను మానితులైన 80 మందికి వ్యాధి నిర్ధారణ కై స్పాట్ ఎక్రే పరీక్షలు చేసి ఫలితాలను తెలియజేశారు. వ్యాధి లక్షణాలను నిర్లక్ష్యం చేయడం వలన వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండడంతో, ప్రజలు నివాసమున్న ప్రాంతాల్లోనే సరికొత్త పందాలో అప్పటికి అప్పుడే వ్యాధి నిర్ధారణకు చెస్ట్ ఎక్స్ -రే పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరిలోనైనా వారం మించి దగ్గు, విడువని జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే అటువంటివారు తక్షణ వైద్య పరీక్షలైన గళ్ళ, చెస్ట్ ఎక్సరే వంటి పరీక్షలు చేయించుకోవాలని ఆ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వ్యాధి పట్ల, కలిగే దుష్పరిణామాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య విద్యను బోధించారు. మన దేశం టీబీ రహిత దేశంగా చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని, టీబీ వ్యాధిని దూరం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చెంబేడు పి హెచ్ సి ఎంపీహెచ్ఈఓ ఎస్ కే రియాజ్, టీబి సూపర్వైజర్ రమణయ్య, ఆరోగ్య సహాయకులు హరి ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ రాజా విక్రమ్, ఎం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


# ఫీడర్ల సోలరైజేషన్ వేగవంతం



అమరావతి: పెన్ పవర్ మే 6. వినియోగదారులకు త్వరితగతిన సర్వీసు అందించడంతో పాటు రెవెన్యూ కలెక్షన్స్ నూరు శాతం సాధించాలని అధికారులను ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డి పి పుల్లారెడ్డి ఆదేశించారు. సిపిడిసిఎల్ కార్యాలయంలో అన్ని జిల్లాల ఎస్ఇలు, ఇఇలతో ఫీడర్ లెవెల్ సోలరైజేషన్, ఎస్‌సి, ఎస్‌టి వినియోగదారులకు సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు, పిఎం సూర్యఘర్‌పై సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎమ్‌డి మాట్లాడుతూ.. లో ఓల్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, అన్ని ఫీడర్లనూ బ్రేక్‌డౌన్ లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సరైన సమయానికి బిల్లింగ్ పూర్తి చేయాలన్నారు. నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్ల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మూడు ప్రశ్నల ద్వారా నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఎపిసిపిడిసిఎల్ పరిధిలో 78.1 శాతం ప్రజలు సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. పబ్లిక్ పర్సెప్షన్ 90 శాతం కంటే ఎక్కువ ఉండాలని, ఆర్‌డిఎస్‌ఎస్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డైరెక్టర్ టెక్నికల్ మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ టివిఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్ ఫైనాన్స్ వెంకటేశ్వర్లు, సిజిఎంలు, జిఎంలు పాల్గొన్నారు.

# కిసాన్ సెజ్ ప్రాంగణంలో మహానాడు కోసం వేడుకగా భూమిపూజ

మే 27, 28, 29వ తేదీల్లో జరిగే మహానాడు కార్యక్రమానికి సంబంధించిన భూమిపూజ వేడుకగా జరిగింది. కొడవలూరు మండలం లోని కిసాన్ సెజ్ ప్రాంగణంలో వేడుకకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీడీపీ సీనియర్ నేతలు భారీగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేసి.. పసుపు పండుగ కోసం అంకురార్పణ చేశారు.







కోవూరు పెన్ పవర్ మే 6. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ,నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు బీద రవిచంద్ర,తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కురుగుండ రామకృష్ణ,పాశం సునీల్ కుమార్, శ్రీ కావ్య కృష్ణారెడ్డి,శ్రీ కాకర్ల సురేష్,శ్రీ ఇంటూరి నాగేశ్వర రావు మరియు కార్పొరేషన్ చైర్మన్లు,మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర,జిల్లా కమిటీ నాయకులు తో కలసి పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 11 వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ లో పర్యటించిన మంత్రి నారాయణ

రాష్ట్రంలో 14 వేల కోట్లతో మంచినీటి సరఫరా ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయి







నెల్లూరు పెన్ పవర్ మే 6. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రాష్ట్రానికి మరో 14 వేల కోట్ల రూపాయలు మంజూరు కానున్నాయి అందులో నెల్లూరు అభివృద్ధికి 700 కోట్లు కేటాయించమని కోరాను గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి ఇప్పుడు జరుగుతోంది ఇవేమీ తెలుసుకోకుండా వైఎస్సార్సిపి నేతలు విమర్శలు చేస్తున్నారు ఎందుకు చేస్తున్నారో కూడా వాళ్ళకే తెలీదు దారినపోయే దానయ్యలు ఇచ్చే సమాచారంతో బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు సరైన సమాచారం కావాలంటే ఆర్టీఐ ద్వారా రాయల్ గా తీసుకోవచ్చు తప్పుడు ఆరోపణలు చేస్తే అభాసుపాలు కాక తప్పదు ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే తిరిగి తీసుకొంటాం–మంత్రి నారాయణ. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హెచ్చరించారు.కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ ఆక్రమణ జరిగినా స్థానికులు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకొంటామన్నారు. నెల్లూరు సిటీలో అభివృద్ధి పరుగులందుకుంటోంది.బుధవారం ఉదయం 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో మంత్రి నారాయణ పర్యటించి, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటిపట్టాల మంజూరుకు కృషిచేస్తానని ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం మీడియాతో మాట్లాడారు.వైఎస్ఆర్సిపి నేతల విమర్శలపై నిప్పులు చెరిగారు. రాష్ట్రవ్యాప్తంగా 14 వేల కోట్లతో మంచినీటి ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద మరో 14 వేల కోట్లు మంజూరు కానున్నాయని వెల్లడించారు. ముఖ్యంగా నెల్లూరు అభివృద్ధి కోసం 700 కోట్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు.గతంలో ఎన్నడూ లేనంత నిధులు రాబట్టి అభివృద్ధి చేస్తుంటే వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ నేతలు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు, దారినపోయే దానయ్యలు ఇచ్చే సమాచారంతో తప్పుడు ఆరోపణలు చేస్తే అభాసుపాలు కాక తప్పదని హెచ్చరించారు. ఆర్ టీ ఐ ద్వారా రాయల్‌గా సమాచారం సేకరించి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని విపక్షాలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాతా అశోక్,రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మెన్ అబ్దుల్అజీజ్,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,ఏడీసీ హేమలత,మాజీ జడ్పిటిసి విజేతా రెడ్డి,టీడీపీ మహిళావిభాగం నేతలు కపిర రేవతి,రాజేశ్వరి,డివిజన్ క్లస్టర్ ఆవుల శ్రీనివాస్,ప్రెసిడెంట్ నాగేంద్ర,టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని ఒకరు దుర్మరణం...







పెళ్లకూరు, పెన్ పవర్, మే 6 నాయుడుపేట – పూతలపట్టు 71వ 6 లైన్ల జాతీయ రహదారి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. అత్యధిక వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ తో ఎందరో ప్రాణాలు బలైపోతున్నాయి. బుధవారం రాత్రి 8 గంటల పైబడి ఎగువ చావాలి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి జరిగిన రోడ్డు ప్రమాదం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఎగువచావానికి చెందిన గోళ్ళ. రాంబాబు (50) కూలి పనులకు వెళ్లి జీవనం సాగించేవాడు. ఆయన బుధవారం రాత్రి ఎగువ చావాలి వద్ద రోడ్డు దాటి ఆవలి వైపు వెళుతున్న సమయంలో నాయుడుపేట వైపు నుండి తిరుపతి వైపు వెళుతున్న ఓ గుర్తు తెలియని వాహ అతన్ని బలంగా ఢీకొనడంతో శరీర అవయవాలు అస్తవ్యస్తంగా మారాయి. అధిక వేగానికి ఆయన అక్కడే మృతి చెందాడు. ప్రమాద సంఘటన తెలుసుకున్న పెళ్లకూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తదుపరి సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్ వాహనంలో నాయుడుపేట సిహెచ్ సి కి తరలించారు. ప్రమాద సంఘటన తీరుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం ఏది అన్నది గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నాలు చేయనున్నారు. ఈ ప్రమాద సంఘటన చూసిన స్థానికులు గగుర్పాటుకు గురయ్యారు.

చనిపోయిన వ్యక్తి కి భార్య, వివాహమైన కుమార్తె ఉన్నారు. ప్రమాదాలు నివారించాలని ప్రభుత్వ యంత్రాంగం ఎన్ని ప్రాథమిక చర్యలు చేపడుతున్న ప్రమాద సంఘటనలలో ఎందరో బలైపోతున్నారు. జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనాలు ఢీకొంటున్న సంఘటనలలో ఆ కుటుంబీకులు ఇన్సూరెన్స్ రూపేణా ఎటువంటి ఆర్థిక ఆదాయం పొందలేక నిరాశ్రయులుగా మారుతున్నారు. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాలను సులభతరంగా గుర్తించేందుకు సుదూర ప్రాంత ప్రమాదాలను గుర్తించగలిగే నిఘా నేత్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉంది. రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తదుపరి చర్యలు కూడా చేపట్టగలిగితే కుటుంబ యజమానులు ఆ కుటుంబాలకు దూరం కాకుండా ఉండే అవకాశాలు ఉన్నాయి.

# 'కలికిరి ప్రీమియర్ లీగ్' క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



కలికిరి: పెన్ పవర్ మే 6. అన్నమయ్య జిల్లా కలికిరి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో కలికిరి ప్రీమియర్ లీగ్ (కెపిఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఏడు రోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయి. మొత్తం ఏడు జట్లు పోటీపడనున్నాయి. చివరి రోజు విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ పోటీలను మాజీ సిఎం కిరణ్ కుమార్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు.వారు మాట్లాడుతూ..యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు దోహదపడతాయని, గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సాగర్ బ్యాంకు చైర్మన్ నల్లారి చంద్రకుమార్ రెడ్డి, క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతనంగా ఏర్పాటు చేసిన మూడు కొత్త జిల్లా కేంద్రాలలో 16% హెచ్ ఆర్ ఏ కోసం అభ్యర్థన...





విజయవాడ, పెన్ పవర్, మే, 06, వెలగపూడి సచివాలయంలో ఈరోజు ఏపీ ఎన్జీవో రాష్ట్ర సంఘ అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎన్ జి జి ఓ నేతలు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శ్రీ సాయి ప్రసాద్ ఐఏఎస్ ని కలిసి ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ అంశాలపై వినతి పత్రాలను అందజేశారు. ముఖ్యంగా ఇటీవల నూతనంగాలి ఏర్పాటు చేసిన మార్కాపురం రంపచోడవరం పోలవరం జిల్లా కేంద్రాలలో ఉద్యోగులందరికీ కూడా 16% హెచ్ ఆర్ ఏ ఇవ్వాల్సిందిగా రిప్రజెంటేషన్ ఇవ్వటం జరిగింది. అంతకుముందు ఏర్పాటుచేసిన ప్రతి జిల్లా కేంద్రాలలోనూ ఉద్యోగులకు 16% వర్తిస్తుంది. దాని ప్రకారం నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కేంద్రాలలో పనిచేస్తున్న ఉద్యోగులు ఉపాధ్యాయులకు కూడా 16 శాతం ఇంటి అద్దె ఎలవెన్సులను నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా అభ్యర్థించడం జరిగింది. ఈ విషయంలో తక్షణమే స్పందించిన చీఫ్ సెక్రటరీ గారు సత్వరమే నిర్ణయం తీసుకునే దిశలో చర్యలు ఉంటాయని ఉద్యోగ సంఘాల నాయకులకు తెలియజేశారు. ఉద్యోగులకు సంబంధించిన అన్ని అంశాలలో ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కార్యక్రమాలను నిర్మాణాత్మకమగ ప్రజల ముంగిటకు తీసుకెళ్లడానికి ఉద్యోగులంతా కృషి చేయాలని కోరారు

ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీజివో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్, , రాష్ట్ర కార్యదర్శి శ్రీ రజనీష్ బాబు, గుంటూరు జిల్లా అధ్యక్షులు శ్రీ ఘంటసాల శ్రీనివాసరావు , విజయవాడ సిటీ ప్రెసిడెంట్ సివిఆర్ ప్రసాద్ , క్యాపిటల్ సిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీలిసిహెచ్ శ్రీధర్ , పాల్గొన్నారు..

# ఇంటింటా జనగణన కార్యక్రమానికి జిల్లావాసులు పూర్తి సహకారాన్ని అందించాలి : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

కాకినాడ : పెన్ పవర్, మే, 06.జిల్లాలో జరుగుతున్న ఇంటింటా జనగణన కార్యక్రమానికి జిల్లా వాసులు తమ పూర్తి సహకారాన్ని అందించి, భవిష్యత్తు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం కాకినాడ పోలీస్ పెరేడ్ మైదానంలో జనగణన కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో చేపట్టిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బిందు మాధవ్, ఇతర పోలీస్ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన 2027 కార్యక్రమాలలో భాగంగా జిల్లాలో మే1 నుంచి 30 వరకు ఇంటింటా జనగణన ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందన్నారు.

# విద్య, వైద్య సేవల విస్తరణ



తిరుపతి సిటీ : పెన్ పవర్ మే 6. టిటిడి ఆధ్వర్యంలో విద్య, వైద్యశాలను మరింత విస్తరించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి) సంస్థ చైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు లడ్డూ, ఐడి కార్డులు మంజూరు చేస్తామని, త్వరలో అక్షర గోవిందం ప్రారంభిస్తామని చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో బుధవారం నిర్వహించిన ధర్మకర్తల మండలి సమావేశం నిర్ణయాలను మీడియాకు ఆయన వెల్లడించారు. తిరుమల ఆళ్వార్ ట్యాంక్ అతిథి గృహం సర్కిల్ నుంచి బాట గంగమ్మ సర్కిల్ వరకు ఉన్న సర్వదర్శనం క్యూలైన్లలో రూ.4.55 కోట్లతో అదనపు మరుగుదొడ్లు నిర్మించేందుకు ధర్మకర్త మండలి ఆమోదం తెలిపిందన్నారు. టిటిడి బోర్డు విద్యా కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు విద్యా సంస్థలలో అత్యాధునిక మౌలిక వసతుల ఏర్పాటుకు అదనంగా రూ.43.40 కోట్లు మంజూరుకు ధర్మకర్త మండలి నిర్ణయం తీసుకుందని తెలిపారు. టిటిడి అవసరాల నిమిత్తం రూ. 44.20 కోట్లతో ఎపికి చెందిన ఆప్కో, తమిళనాడుకు చెందిన కో–ఆప్టెక్స్ సంస్థల నుండి పట్టు వస్త్రాలు, దుప్పటాలు తదితరాలుబి కొనుగోలు, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలోని వర్ధనపల్లి గ్రామంలో శివాలయం నిర్మాణానికిబి రూ.55బిలక్షలు ఆర్థిక సాయం అందించేందుకు ఆమోదం తెలిపారన్నారు. సనాతన ధర్మాన్ని మరింత వ్యాప్తి చేసేందుకు తలపెట్టినబి "అక్షర గోవిందం" కార్యక్రమంలో పాల్గొనే చిన్న పిల్లలకుబి పంపిణీ చేసే కిట్‌ను ఉచితంగా అందించాలని నిర్ణయించామని చెప్పారు. తిరుమలలోని వరాహస్వామి విశ్రాంతి భవనం–1లో రూ. 3.61 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆమోదం, తిరుపతిలోని అలిపిరి వద్ద రూ.4.75 కోట్లతో శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం కోసం యాగశాల నిర్మించేందుకు నిర్ణయం చేసినట్లు తెలిపారు. డాక్టర్ శోభారాజును టిటిడి ఆస్థాన విద్వాన్‌గా నియమించేందుకు ఆమోదించినట్లు తెలిపారు. గుంటూరు జిల్లాలోని తుళ్లూరు మండలంబి అనంతవరంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో రూ.2.71 కోట్లతో రాజ గోపురం నిర్మాణానికి ఆమోదం, అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో రూ.36.95 కోట్లతో ఏడు అంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, పుష్కరిణి నిర్మాణానికి, శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలో నూతన కల్యాణ మండపం నిర్మించేందుకు ధర్మకర్త మండలి ఆమోదం తెలిపినట్లు చెప్పారు.

# సీఎం క్యాండిడేట్... సిట్టింగ్ ఎంపీ...ఓటమి

**గౌహాతి, మే 6, పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ నుంచి ముఖ్యమంత్రిగా భావించిన గౌరవ్ గొగోయ్.. సిట్టింగ్ ఎంపీగా ఉండి కూడా అసెంబ్లీ పోరులో పరాజయం పాలవ్వడం ఇప్పుడు అస్సాంలో హాట్ టాపిక్‌గా మారింది. . కేవలం వారసత్వంతోనే గెలవలేమని, ప్రజల మధ్య ఉండకపోతే ఎంతటి దిగ్గజాలకైనా ఓటమి తప్పదని ఈ ఫలితం నిరూపించిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌పార్టీకి కోలుకోలేని షాక్ ఇచ్చాయి. ముఖ్యంగా ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న, మూడుసార్లు ఎంపీగా గెలిచిన గౌరవ్ గొగోయ్ తన సొంత ఇలాకా జోర్హాట్‌లో ఓటమి పాలవ్వడం అందరినీ విస్మయానికి గురిచేసింది. మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ వారసుడిగా భారీ అంచనాలతో బరిలోకి దిగిన గౌరవ్.. బీజేపీ సీనియర్ నేత హితేంద్రనాథ్ గోస్వామి చేతిలో దాదాపు 22,000 ఓట్ల భారీతేడాతో పరాజయం పాలయ్యారు. తన లోక్‌సభ పరిధిలోని దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పట్టు కోల్పోవడం గమనార్హం.గౌరవ్ గొగోయ్ ఓటమికి ప్రధాన కారణం ప్రజలకు అందుబాటులోలేకపో వడమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రచార సమయంలో ఆయన క్షేత్రస్థాయిలో తగినంతగా కనిపించలేదని.. కేవలం తన తండ్రి పేరు మీద, అహోం సామాజిక వర్గ సమీకరణాల మీద అతిగా ఆధార పడటం బెడిసి కొట్టిందని చెబుతున్నారు. అలాగే బీజేపీ వ్యూహాత్మకంగా గౌరవ్‌ను 'జాతీయ రాజకీయాలకు మాత్రమే సరిపోయే నేత'గా చిత్రీకరించడంలో సఫలమైందని పేర్కొంటున్నారు. స్థానిక సమస్యల కంటే ఢిల్లీ రాజకీయాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తారన్న ప్రచారం ఓటర్లను తీవ్రంగా ప్రభావితం చేసిందని వివరిస్తున్నారు.ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఎన్నికల్లో.. 'అభివృద్ధి వర్సెస్‌అడ్డంకులు'గా మధ్య పోటీగా అభివర్ణించి ఓటర్ల మనసు గెలుచుకున్నారు. గత ఐదేళ్లలో జోర్హాట్‌లో జరిగిన మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జోర్హాట్‌లో చేరిన హోలోంగపర్ పంచాయితీ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి బీజేపీకి బాగా కలిసొచ్చింది. హితేంద్రనాథ్ గోస్వామి ఎక్కడా దూకుడుగా వ్యవహరించకుండా.. గౌరవ్‌ను గౌరవిస్తూనే.. తాను లోకల్ లీడర్‌గా ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పడం ఓటర్లను ఆకట్టుకుంది.కేంద్ర మంత్రి పవిత్ర మార్గరీటా జోర్హాట్‌లో మకాం వేసి క్షేత్రస్థాయిలో చేసిన కృషి గొగోయ్ ఓటమిలో కీలక పాత్ర పోషించింది. గౌరవ్ లాగే అహోం సామాజిక వర్గానికి చెందిన పవిత్ర.. నిరంతరం ప్రజల్లో ఉంటూ గొగోయ్ ఓటు బ్యాంకును చీల్చగలిగారు. దీనికి తోడు హిమంత బిశ్వ శర్మ నిర్వహించిన భారీ ర్యాలీలు, ఇంటింటి ప్రచారం కాంగ్రెస్ ఓటమికి కారణం అయ్యాయి. యువ ఓటర్లలో అత్యధిక భాగం పోలింగ్ రోజున అందుబాటులో లేకపోవడం కూడా గౌరవ్ మెజారిటీని తగ్గించింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## విశాఖలో ఎమ్మెల్యే వర్సెస్ కార్పొరేటర్..!

**విశాఖపట్టణం, మే 6, పెన్ పవర్:** విశాఖపట్నంలోని డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి సెంట్రల్ పార్క్ (పాత సెంట్రల్ జైలు రోడ్డు) వద్ద సుమారు ఆరు కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయ తలపెట్టిన ఫుడ్ కోర్టు నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ ప్రాజెక్టుపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం, ప్రస్తుతానికి పనులన్నింటినీ నిలిపివేస్తూ స్టేటస్ కో విధిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కొద్దిరోజుల క్రితమే ఈ ఫుడ్ కోర్టు నిర్మాణానికి విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ అట్టహాసంగా శంకుస్థాపన చేశారు.అయితే, గ్రీనరీ మరియు బహిరంగ ప్రదేశాల కోసం ఉద్దేశించిన సెంట్రల్ పార్క్ స్థలంలో వాణిజ్య పరమైన ఫుడ్ కోర్టును నిర్మించడం నిబంధనలకు విరుద్ధమని జనసేన సీనియర్ నేత, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ హైకోర్టును ఆశ్రయించారు. పర్యావరణ నిబంధనలను పక్కనబెట్టి, పార్కును వాణిజ్య కేంద్రంగా మార్చడం వల్ల నగరంలోని ఊపిరితిత్తుల్లాంటి పార్కులు దెబ్బతింటాయని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసును విచారించిన జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం స్టేటస్ కో విధిస్తూ ఆదేశాలిచ్చింది.వేసవి సెలవుల అనంతరం కోర్టు తిరిగి తెరిచి, విచారణ జరిగే వరకు ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో తమ వివరణ ఇవ్వాలని జీవీఎంసీ , వీఎంఆర్డీఏ , జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖలకు నోటీసులు జారీ చేసింది. ఈ పరిణామం ఇప్పుడు విశాఖ జనసేనలో అంతర్గత విభేదాలను రోడ్డుపైకి తెచ్చింది. ఒకవైపు జనసేనఎమ్మెల్యే వంశీకృష్ణ ఈ ప్రాజెక్టును తన ప్రతిష్టాత్మక విజయంగా చెప్పుకుంటుండగా, అదే పార్టీకి చెందిన కార్పొరేటర్ మూర్తి యాదవ్ కోర్టుకు వెళ్లి దాన్ని అడ్డుకోవడం రాజకీయంగా కలకలం రేపుతోంది.నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని మూర్తి యాదవ్ వర్గం ఆరోపిస్తుంటే.. అభివృద్ధిని అడ్డుకుంటున్నారని వంశీకృష్ణ మద్దతుదారులు విమర్శిస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఉన్న నైట్ ఫుడ్ కోర్టును తొలగించి, పాత వెండర్లను కాదని కొత్త వారికి షాపులు కేటాయిస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో ఈ స్టే రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఏపీ జననాయకుడిగా లోకేష్

**విజయవాడ, మే 6, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో నారా లోకేష్ ప్రాధాన్యత అందరికీ తెలిసిందే. ఆయన చంద్రబాబు తరువాత స్థానంలో ఉన్నారు. ఈ మధ్యనే ఆయనకు పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కూడా ఇచ్చారు బాబు ఆయనతో ప్రమాణం చేయించారు. ఇక ప్రభుత్వంలో కీలక శాఖలను చూస్తున్న యువ మంత్రిగా ఉన్నారు. అలా పార్టీ ప్రభుత్వంలో లోకేష్ ప్రాధాన్యతమైన ప్రభావవంతమైన పాత్ర నిర్వహిస్తున్నారు. అయితే ఇది మాత్రమే సరిపోదని జనాలకు పార్టీ జనాలకు లోకేష్ మరింతగా కనెక్ట్ కావాల్సిన అవసరం ఉందని పార్టీ భావిస్తోంది అని అంటున్నారు. రాష్ట్రంలో చూస్తే పక్కా మాస్ లీడర్ గా లోకేష్ ని చూపించాలన్న వ్యూహం టీడీపీకి ఉందని అంటున్నారు. లోకేష్ ఇప్పటికే పార్టీ వారిని కలుస్తున్నారు. ప్రభుత్వంలో మంత్రులతో కూడా ఇంటరాక్ట్ అవుతున్నారు. ఎమ్మెల్యేలతో కూడా ఆయన కలసి మెలసి ఉంటున్నారు. క్యాడర్ కి దగ్గరగా ఉండడం చేస్తున్నారు. అయితే ఇది చాలదని అంత కంటే ఎక్కువగా జనంలో ఉండేలా ఒక బృహత్ కార్యక్రమం పార్టీ పెద్దలు డిజైన్ చేస్తున్నారు. అది ఎంతలా అంటే లోకేష్ పేరు జన బాహుళ్యంలో మారు మోగేలా అని అంటున్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో తనలోని నాయకత్వ లక్షణాలను బయటపెట్టారు. దాంతో అందరూ ఆయనలోని కొత్త కోణాన్ని చూశారు అలా ఒకేసారి లోకేష్ పది మెట్లు ఎక్కేశారు. అయితే ఇపుడు పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో లోకేష్ మళ్ళీ జనంతో కనెక్ట్ కావాల్సి ఉందని భావిస్తున్నారు. ఇక నారా లోకేష్ విషయం తీసుకుంటే ఆయన 2023లో చేపట్టిన యువగళం పాదయాత్ర సూపర్ సక్సెస్ అయింది అంతకు ముందు ఆ తరువాత అన్నట్లుగా లోకేష్ పాత్రను మార్చేసింది. ఇక ఆ మీదట టీడీపీ కూటమి విజయం సాధించడం లోకేష్ ప్రభుత్వంలో మంత్రిగా ఉండడం గడచిన రెండేళ్ళలో తన సత్తాను తన శాఖలల నిరూపించుకోవడం వంటివి జరుగుతున్నాయి. అయితే ఈసారి అలా కాదు, 2029 ఎన్నికల నేపథ్యంలో లోకేష్ ఇంతకు ఇంత రాజకీయంగా రాటు తేలాలీ అంటే జనంలో నిత్యం ఉండేలా పార్టీ రాష్ట్ర స్థాయి పర్యటనలు



కార్యక్రమాలు డిజైన్ చేస్తోంది అని అంటున్నారు ఫుల్ ఫోకస్ ఉండేలా : ఏపీలో చంద్రబాబుకు దిగ్గజ నేతగా పేరుంది. ఆయన వారసుడిగా లోకేష్ కి పార్టీలో ఎదురులేదు, యాక్సెప్టెన్స్ ఉంది. అయితే జనసామాన్యంలో కూడా దానికి బలమైన ఆమోదం అవసరం అన్నదే పార్టీ వ్యూహకర్తల భావనగా ఉంది. చంద్రబాబు తరువాత సిసలైన నాయకుడు పార్టీకే కాదు రాష్ట్రానికి రేపటి రాష్ట్ర భవిష్యత్తుకూ లోకేష్ అని ఏపీలోని ఆరు కోట్ల జనాలు అంతా ఆమోదించేలా ఉండాలీ అంటే లోకేష్ మరింతగా జనంలో ఉంటూ తన సత్తాను నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. దాని కోసమే పార్టీ ఒక భారీ యాక్షన్ ప్లాన్ ని రూపొందిస్తోంది అని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలీ అంటే లోకేష్ మీదనే ఫుల్ ఫోకస్ ఉండేలా టీడీపీ పథక రచన చేస్తోంది అని అంటున్నారు. పార్టీ అధినేత వేరు, మంత్రిగా సామర్థ్యం వేరు, ఆరు కోట్ల మంది ఉన్న ఒక రాష్ట్రాన్ని నడిపించే అధినేతగా ఉండడం వేరు. జనాలకు ఆ భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని అంటున్నారు లోకేష్ లో చంద్రబాబుని చూసుకునేలా ఉండాలంటే మరింతగా లోకేష్ జనంలో ఉంటూ కష్టపడాల్సి ఉందని అంటున్నారు. పై స్థాయిలో పార్టీ పరంగా పదవులు అందుకోవడం కాకుండా జనం నుంచే వాటికి తగిన ఆమోద ముద్ర వేయించుకోవాలంటే ప్రజల వద్దకు లోకేష్ వెళ్లడమే ఉత్తమ మార్గం అని పార్టీలో చర్చ సాగుతోంది. దాంతో రానున్న కాలంలో లోకేష్ తో రాష్ట్ర స్థాయిలో పర్యటించేందుకు భారీ కార్యక్రమాలనే డిజైన్ చేయిస్తున్నారు అని అంటున్నారు. అవి ఏ స్థాయిలో ఉంటాయో యువ గళాన్ని మించి ఏ తీరున ఉంటాయో అన్నది వేచి చూడాల్సి ఉంది. ఏది ఏమైనా లోకేష్ జన నాయకుడు అనిపించుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. సో ఆ దిశగా భారీ కార్యాచరణ అయితే టీడీపీ సిద్ధం చేసి పెడుతోంది అని అంటున్నారు

## ఎమ్మెల్సీ అనంతబాబుకు బిగిస్తున్న ఉచ్చు

**కాకినాడ, మే 6 పెన్ పవర్:** సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోంది. ఈ కేసులో సాక్షులను బెదిరించారన్న అభియోగాలపై అనంతబాబును ఒకరోజు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ కాకినాడలోని మొబైల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న అనంతబాబును పోలీసులు బుధవారం ఉదయం కస్టడీలోకి తీసుకున్నారు. భారీ భద్రత నడుమ ఆయనను రోడ్డు మార్గంలో రాజమహేంద్రవరం నుంచి కాకినాడకు తరలించారు. ఈ రోజు మొత్తం పోలీసుల విచారణ కొనసాగనుంది.డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక సాక్షులను ప్రలోభపెట్టడం, వారిని బెదిరించడం ద్వారా కేసును పక్కదారి పట్టించేందుకు అనంతబాబు ప్రయత్నించారనేది ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులు ఆయనను విచారించనున్నారు. సాక్షులను ఎవరెవరి ద్వారా బెదిరించారు? దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు ప్రశ్నించనున్నారు. గతంలో విచారణ సమయంలో అనంతబాబు సహకరించలేదనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, ఈ ఒకరోజు కస్టడీని పోలీసులు అత్యంత కీలకంగా భావిస్తున్నారు.విచారణ అనంతరం ఆయనను తిరిగి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించనున్నారు. ఎమ్మెల్సీ కస్టడీ వార్తతో కాకినాడలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కేసు విచారణ నెమ్మదిగా సాగిందన్న విమర్శలు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలన్న పట్టుదలతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. అనంతబాబు జైలులో ఉంటూనే తన అనుచరుల ద్వారా సాక్షులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఈ కస్టడీని కోరారు. సాక్షులు మాట మార్చకుండా ఉండేందుకు ఈ విచారణ అత్యంత కీలకం కానుంది. జైలు నుంచి లేదా బయట ఉన్న వ్యక్తులతో అనంతబాబు ఎవరితో మాట్లాడారు..? సాక్షులకు వెళ్లిన బెదిరింపు కాల్స్‌కు, అనంతబాబు అనుచరులకు ఉన్న సంబంధంపై పోలీసులు టెక్నికల్ ఆధారాలను సేకరించినట్లు సమాచారం.

## నెల్లూరులో చకచకా మహానాడు ఏర్పాట్లు

**నెల్లూరు మే 6, పెన్ పవర్:** టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు.. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే పసుపు పండుగ –టీడీపీ మహానాడు.– పార్టీలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ మహానాడును మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఒక్క కరోనా సమయంలోనే ఆన్‌లైన్ వేదికగా దీనిని నిర్వహించా రు. ఆ తర్వాత.. పలు జిల్లాల్లో దీనిని నిర్వహిస్తూ.. పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ! ఈనెల 29న అన్నగారి జయంతిని పురస్కరించుకుని నిర్వహించే మహానాడుకు రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. 1) తాజాగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవడం. ఇప్పటికే వారితో ప్రమా ణం కూడా చేయించారు. ప్రస్తుతం వీరి ఆధ్వర్యంలోనే మహానాడును నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో యువత సెంట్రిక్‌గానే మహానాడును నిర్వహిం చేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. మహిళలకు ప్రాధాన్యం: ఈ దఫా టీడీపీలో మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే కమిటీలలోనూ వారికి ప్రాధాన్యం ఇచ్చారు. మహానాడు వేదికగా.. మహిళా ప్రాతినిధ్యంపై కీలక ప్రకటన చేయనున్నారు. ఈ నేపథ్యంలో మహానాడుకు అత్యంత ప్రాధాన్యం పెరిగింది. మరో రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం కూడా రానున్న నేపథ్యం కూడా దీనికి తోడైంది. వేదిక మార్పు వెను.. ! వాస్తవానికి ఈ దఫా మహానాడును శ్రీకాకుళంలో నిర్వహించాలని భావించారు. దీనికి సంబంధించి టెక్క లి, ఎచ్చర్ల నియోజకవర్గాల్లో రెండు చోట్ల పలు ప్రాంతాలను కూడా పరిశీలించారు. అయితే.. అనూహ్యంగా ఈ వేదిక నెల్లూరుకు మారింది. శ్రీకాకుళం కడు దూరంగా ఉండడం.. కార్యకర్తలను ఎండలో అక్కడకు తరలించడం ఇబ్బందిగా ఉంటుందన్న నేపథ్యంలో వేదికను నెల్లూరుకు మార్చారు. అదేసమయంలో సీమలో పార్టీని బలోపేతం చేయాలన్న లక్ష్యం కూడా దీనికి కలిసి వచ్చింది. కాగా.. గత ఏడాది మహానాడును కడపలో నిర్వహించిన విషయం తెలిసిందే.

# ఉత్తరాంధ్రలో వారసులోస్తున్నారు

**విశాఖపట్టణం, మే 6, పెన్ పవర్:** రాజకీయాల్లో వారసత్వాలకు కొరత, కొదవలేదు. సీనియర్లు తమ కుటుంబాల నుంచి నాయకులను పరిచయం చేస్తున్నారు. యువ నేతలు కూడా దూకుడుగానే వ్యవహరిస్తున్నారు. టికెట్ వస్తుందా రాదా అనే విషయాన్ని పక్కన పెడితే యువ నేతలు ఉత్సాహంగానే రాజకీయాలు చేసేందుకు ముందుకు వస్తున్నారు .ఈ క్రమంలో రాయలసీమ నుంచి ఎక్కువ మంది యువ నేతలు కనిపిస్తుండగా.. అదే స్థాయిలో ఉత్తరాంధ్ర నుంచి కూడా యువ నేతలు రాజకీయ రంగ ప్రవేశం ఇప్పటికే చేశారు. మరి కొందరు రెడీగా కూడా ఉన్నారు. అయితే వీరిలో ఎంతమంది ప్రజలను ఒప్పించగలరు.. మెప్పించగలరు.. ఓటు బ్యాంకును సాధించగలరు.. అనే విషయాలు ఎటు తేలడం లేదు. గత ఎన్నికల్లోనే ఒకరిద్దరు సీనియర్ నాయకులు తమ వారసులను రంగంలోకి దింపాలని భావించారు. , పోటీ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అటు వైసిపి ఇటు టిడిపి కూడా వారసులకు టికెట్లు ఇవ్వలేదు. దీంతో వారసులు పక్కకు తప్పుకోవాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు వచ్చే ఎన్నికల నాటికి మాత్రం ఖచ్చితంగా తమ వారసులను బరిలో నెలపాలని సీనియర్లు ఇప్పటినుంచే పట్టుబడుతున్నారు. తమ పిల్లలను నియోజకవర్గాల్లోకి దింపేశారు కూడా. ఇలాంటి వారిలో ఉమ్మడి విశాఖపట్నంలోని నర్సీపట్నం నియోజకవర్గం నుంచి చింతకాయల విజయ్ దూకుడుగా ఉన్నారు. ఈయన పార్టీలో సీనియర్ యువనేతగా పనిచేస్తున్నారు. గత ఎన్నికల సమయంలోనూ దీనికి ముందు కూడా ఆయన యాక్టివ్గా పార్టీ కార్యక్రమాల్లో పార్టిసిపేట్ చేశారువచ్చే ఎన్నికల్లో కచ్చితంగా విజయ్ కు టికెట్ ఇవ్వాల్సిందేనని ఆయన తండ్రి, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పట్టుబడుతున్నారు. పైగా లోకేష్ టీం లో ఉన్నారన్న చర్చ కూడా వినిపిస్తోంది. దీంతో ఖచ్చితంగా విజయ్‌కు టికెట్ లభించటం ఖాయమని అంటున్నారు. ఇక స్థానికంగా ఉన్న రాజకీయాలను గమనిస్తే చింతకాయల విజయ్ కు యువత ఫాలోయింగ్ ఎక్కువగానే ఉంది. ప్రజల్లోనూ అయ్యన్నపాత్రుడుకు ఉన్న సానుభూతి.. వారికి ఉన్న రాజకీయ వర్గం విజయ్‌కు అనుకూలంగానే మారే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఆయన విజయం సాధించడం ఖాయమని చెబుతున్నారు ఇక ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని ఆముదాల వలస నియోజకవర్గం నుంచి ఈ దఫా తమ్మినేని చిరంజీవి కచ్చితంగా పోటీ చేస్తారని ఆయన తండ్రి అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఘంటాపదంగా చెబుతున్నారు. వాస్తవానికి గత ఎన్నికల్లోనే చిరంజీవి నాగ్‌కు టిక్కెట్టు ఇవ్వాలని సీతారాం పట్టుబట్టారు. కానీ.. అనూహ్యంగా రాజకీయ పరిణామాలు మారిపోవడంతో జగన్ ఈ విషయాన్ని పక్కనపెట్టి సీతారామ్‌కే టికెట్ కేటాయించారు.

కానీ ఇప్పుడు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నందున వచ్చే ఎన్నికల్లో చిరంజీవి నాగ్ కు టికెట్ ఇవ్వాల్సిందేనని సీతారాం తేల్చేశారు. దీనిపై వైసీపీ అధినేత జగన్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోయినప్పటికీ టికెట్ ఖాయమనే చర్చ నడుస్తోంది ఇక చిరంజీవి రాజకీయాలను చూసుకుంటే గత రెండు ఎన్నికల్లో కూడా తండ్రి తరఫున ఆయన ప్రచారం చేశారు. యువతను ఆకట్టుకునే లాగా వ్యవహరించారు. ముఖ్యంగా ఐటి రంగంలో అనుభవం ఉన్న చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని ముమ్మరం చేయడం విశేషం. తరచుగా సోషల్ మీడియాలో ఆయన అనేక పోస్టులు పెడుతూ ఉంటారు. యూట్యూబ్ లో చానల్స్ కూడా నడుపుతారు. దీంతో ఆయనకు మంచి ఫాలోయింగ్ ఉందని చెబుతారు. ఇది వచ్చే ఎన్నికల్లో చిరంజీవికి కలిసివచ్చే అంశం అని అంటున్నారు. ఇక ఉత్తరాంధ్రకు చెందిన మరో యువ నాయకుడు కిడారి శ్రావణ్ కుమార్ 2014లో వైసిపి తరఫున అరకు నుంచి పోటీ చేసిన కిడారి సర్వేశ్వరరావు తర్వాత కాలంలో టిడిపిలోకి వచ్చారు. ఆయనకు మంత్రి పదవి దక్కుతుందని కూడా చర్చ నడిచింది. ఇంతలోనే మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో సర్వేశ్వరరావు మృతి చెందారు. అనంతరం ఆయన వారసుడిగా కిడారి శ్రావణ్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు ఆయనకు మంత్రి పదవి కూడా ఇచ్చారు. నిజానికి అప్పటికి అటు అసెంబ్లీకి కానీ ఇటు శాసన మండలికి కానీ శ్రావణ్ కుమార్ ప్రాతినిధ్యం వహించడం లేదు. అయినప్పటికీ ఆరు మాసాల పాటు ఆయన మంత్రిగా పనిచేశారు. తర్వాత 2019 ఎన్నికల్లో అదే అరకు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయనకు టిడిపి టికెట్ ఇచ్చింది. కానీ వైసీపీ హవాతో పాటు జగన్ పాదయాత్ర కారణంగా శ్రావణ్ కుమార్ పరాజయం పాలయ్యారు. ఓ రకంగా చెప్పాలంటే ఆయనకు డిపాజిట్ దక్కలేదని కూడా ప్రచారంలో ఉంది. గత ఎన్నికల విషయానికి వచ్చేసరికి అసలు పార్టీ టికెట్ కూడా ఇవ్వలేదు. అంతర్గతంగా చేయించిన సర్వేలు పార్టీ సీనియర్ నాయకులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు గత ఎన్నికల్లో ఈ టికెట్ను మిత్రపక్షమైన బిజెపికి కేటాయించారు. ఇక వచ్చే ఎన్నికల నాటికైనా కిడారి శ్రావణ్‌కు టికెట్ దక్కుతుందా లేదా అనేది చూడాలి.

ప్రస్తుతం అయితే ఆయన తన ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో యువతను ఆకర్షించే దిశగా కూడా ప్రయత్నిస్తున్నారు. కానీ, వచ్చే ఎన్నికల నాటికి టికెట్ విషయంలో పార్టీ నుంచి ఇంకా ఎటు వంటి హామీ లభించలేదు. ఆయన చేసే పనితీరు, పార్టీలో వ్యవ హరించే విధానాలు, పార్టీని ముందుకు తీసుకెళ్లే విషయంలో ఎలా వ్యవహరిస్తారు అనే అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే టికెట్ పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని స్థానిక టిడిపి నేతలు చెబుతున్నారు. సో ఇలా కొంతమంది యువ నాయకులు ఉత్తరాంధ్ర నుంచి రాజకీయాల్లోకి వచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరి ఏ మేరకు సక్సెస్ అవుతారు అనేది చూడాలి.

# ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసులో ఉత్కంఠ... ఏ జట్టు పరిస్థితి ఎలా ఉందంటే?

- రసవత్తరంగా మారిన ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసు
- పాయింట్ల పట్టికలో టాప్-4లో పంజాబ్, బెంగళూరు, హైదరాబాద్, రాజస్థాన్
- రేసులోకి బలంగా పుంజుకున్న చెన్నై సూపర్ కింగ్స్
- ఢిల్లీ, కోల్‌కతా, ముంబై జట్లకు ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై'
- అనేక జట్ల భవిష్యత్తును నిర్ధారించనున్న నెట్ రన్ రేట్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు ఊహించని మలుపులతో అత్యంత రసవత్తరంగా మారింది. లీగ్ దశ ముగింపునకు వస్తున్నా, ఏ జట్టుకూ ఇంకా ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు కాలేదు. గణాంకాల ప్రకారం ఇంకా ఏ జట్టూ అధికారికంగా రేసు నుంచి నిష్క్రమించకపోవడంతో రాబోయే ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగనుంది. ముఖ్యంగా పాయింట్ల పట్టికలో జట్ల మధ్య స్వల్ప తేడాలు మాత్రమే ఉండటంతో నెట్ రన్ రేట్ (చీ==) కీలకంగా మారనుంది.

**అగ్రస్థానంలో పంజాబ్, బెంగళూరు**

ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్లు పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. పంజాబ్ 13 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, బెంగళూరు 12 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈ రెండు జట్లూ మెరుగైన నెట్ రన్ రేట్‌ను కలిగి ఉండటం వారికి కలిసొచ్చే అంశం. పంజాబ్ తన మిగిలిన 5 మ్యాచ్‌లలో 2 గెలిస్తే సులభంగా అర్హత సాధిస్తుంది. ఇక, ఆర్‌సీబీ (о1.420)కి ఉన్న భారీ నెట్ రన్ రేట్ వారి ప్రధాన బలం. వారు 2-3 విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం.

**మధ్యలో తీవ్ర పోటీ.. పుంజుకున్న చెన్నై**

సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH), రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్), గుజరాత్ టైటాన్స్ (జీటీ) జట్లు కూడా 12 పాయింట్లతో టాప్ జట్లకు గట్టి పోటీ ఇస్తున్నాయి. అయితే, ఈ మూడు జట్లు పంజాబ్, బెంగళూరు కంటే ఒక మ్యాచ్ అదనంగా ఆడాయి. హైదరాబాద్, రాజస్థాన్ పాజిటివ్ రన్ రేట్‌తో మెరుగైన స్థితిలో ఉండగా, గుజరాత్ టైటాన్స్ నెగటివ్ రన్ రేట్‌తో (-0.147) ఇబ్బంది పడుతోంది. జీటీ ప్లేఆఫ్స్ చేరాలంటే రాబోయే మ్యాచ్‌లలో భారీ విజయాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

మరోవైపు, సీజన్‌ను నెమ్మదిగా ప్రారంభించిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) చివరి నాలుగు మ్యాచ్‌లలో మూడు గెలిచి రేసులోకి బలంగా పుంజుకుంది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని ఈ జట్టు, మిగిలిన 4 మ్యాచ్‌లలో కనీసం 3 గెలవడం ద్వారా 16 పాయింట్లతో ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలని చూస్తోంది. సీఎస్‌కేకి ఉన్న పాజిటివ్ నెట్ రన్ రేట్ (о0.151) చివరి దశలో వారికి ఉపయోగపడవచ్చు.

**ఇకపై ప్రతి మ్యాచ్ కీలకమే**

ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), ముంబై ఇండియన్స్ (ఎంఐ) జట్ల పరిస్థితి క్లిష్టంగా మారింది. ఢిల్లీకి ఇకపై ఒక్క ఓటమి కూడా వారి అవకాశాలను దెబ్బతీస్తుంది. మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలిస్తేనే వారికి అవకాశం ఉంటుంది. కోల్‌కతా, ముంబయి జట్లు కూడా దాదాపు ఇదే పరిస్థితిలో ఉన్నాయి. ఈ జట్లు మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలవడంతో పాటు ఇతర జట్ల ఫలితాలు కూడా తమకు అనుకూలంగా రావాలని కోరుకోవాలి. ఈ మూడు జట్లకు వారి నెగటివ్ నెట్ రన్ రేట్ పెద్ద అవరోధంగా మారింది. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) అద్భుతంగా రాణించి మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలిచినా, వారి అత్యంత దారుణమైన నెట్ రన్ రేట్ (-1.076) కారణంగా ప్లేఆఫ్స్ చేరడం దాదాపు అసాధ్యం.

మొత్తం మీద రాబోయే రెండు వారాలు అభిమానులకు అసలైన టీ20 మజాను పంచనున్నాయి. ప్రతి పరుగు, ప్రతి వికెట్ పాయింట్ల పట్టికను, జట్ల భవిష్యత్తును మార్చే అవకాశం ఉండటంతో ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసు చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగడం ఖాయం.

# వీఐపీ టికెట్ల రగడ: బెంగళూరులో ఫైనల్ నిర్వహణపై బీసీసీఐ పునరాలోచన

- ఐపీఎల్ 2026 ఫైనల్ వేదికపై సందిగ్ధత
- ఎమ్మెల్యేల ఉచిత టికెట్ల వివాదంతో బెంగళూరుకు గండం
- సమస్య పరిష్కరించకపోతే వేదిక మార్పు తప్పదని బీసీసీఐ హెచ్చరిక
- డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆర్సీబీకి దక్కాల్సిన ఆతిథ్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ తుది అంకానికి చేరుకుంటున్న వేళ, ఫైనల్ మ్యాచ్ వేదికపై తీవ్ర అనిశ్చితి నెలకొంది. కర్ణాటకలో ఎమ్మెల్యేలకు ఉచిత టికెట్ల కేటాయింపుపై చెలరేగిన వివాదం కారణంగా, ఫైనల్ మ్యాచ్‌ను బెంగళూరు నుంచి మరో నగరానికి తరలించే యోచనలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం, గత సీజన్ విజేత హోమ్‌గ్రౌండ్‌లోనే ఫైనల్ నిర్వహించడం ఆనవాయితీ. ఈ లెక్కన డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సొంతగడ్డ అయిన చిన్నస్వామి స్టేడియంలోనే ఫైనల్ జరగాల్సి ఉంది. అయితే, "మేము ప్రజాప్రతినిధులం, వీఐపీలం, క్యూలో నిల్చోలేం" అంటూ కొందరు ఎమ్మెల్యేలు ఉచిత టికెట్ల కోసం డిమాండ్ చేయడం వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై బీసీసీఐ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఈ వివాదంపై కర్ణాటక ప్రభుత్వం స్పందించి, ప్రతి ఎమ్మెల్యేకు మూడు టికెట్లు కేటాయిస్తామని సర్దిచెప్పే ప్రయత్నం చేసింది. అయినప్పటికీ, ఈ రాజకీయ రగడ ఫైనల్ వంటి మెగా ఈవెంట్ నిర్వహణకు ఆటంకం కలిగించవచ్చని బీసీసీఐ భావిస్తోంది. "టికెట్ల సమస్యకు పరిష్కారం లభించకపోతే, ఫైనల్ వేదికను మరో నగరానికి తరలిస్తాం" అని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ప్లేఆఫ్ మ్యాచ్‌లను పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల్లో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, ఫైనల్ వేదికపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రస్తుతం లీగ్ దశలో పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ 12 పాయింట్లతో గట్టి పోటీ ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫైనల్ వేదికపై బీసీసీఐ అధికారిక ప్రకటన కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పంజాబ్‌పై హైదరాబాద్ ఘన విజయం.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి సన్‌రైజర్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో ఉప్పల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 33 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ ఏ దశలోనూ లక్ష్యాన్ని ఛేధించే ప్రదర్శన కనబరచలేదు. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 202 పరుగులకే పంజాబ్ కుప్పకూలింది. పంజాబ్ బ్యాట్స్‌మెన్ కూపర్ కానెల్లి ఒంటరి పోరాటం చేశాడు. 59 బంతుల్లోనే 107 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. పంజాబ్ జట్టులో మిగిలిన ఆటగాళ్లు ఎవరూ రాణించలేదు. ఈ గెలుపుతో హైదరాబాద్ పాయింట్ల పట్టికలో పంజాబ్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానంలోకి వచ్చింది. 11 మ్యాచ్‌లకు గాను 7 మ్యాచ్‌లు గెలిచి 14 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. పంజాబ్ కింగ్స్ రెండో స్థానానికి పడిపోయింది.


# జాన్వీ హొయలు ఆ రేంజులో..







బాలీవుడ్ అందాల నటి జాన్వీ కపూర్ ప్రస్తుతం నటనా రంగంలోనే కాదు.. ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. అటు బాలీవుడ్‌లో తిరుగులేని ఫ్యాషనిస్టాగా గుర్తింపు పొంది.. ప్రతి ఈవెంట్‌లోనూ తన ప్రత్యేకమైన వస్త్రధారణతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఫ్యాషన్ ఇండస్ట్రీ - సినిమాల మధ్య సమతుల్యతను కాపాడుకుంటూ ఒక గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగే దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా జాన్వీ ప్రముఖ పంజాబీ గాయకుడు ఆలపించిన గీతానికి అందమైన ఎక్స్ ప్రెషన్స్ తో ఇమ్మిటేట్ చేస్తూ యూత్ ని టీజ్ చేస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర హీరోయిన్‌గా ఎదగాలనే లక్ష్యంతో ఉన్న జాన్వీకి, ఎన్టీఆర్ సరసన నటించిన -దేవర- చిత్రం భారీ విజయాన్ని అందించడమే కాకుండా.. ఇక్కడ బలమైన పునాదిని వేసింది. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన -పెద్ది- సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందని భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో రామ్ చరణ్ లాంటి పాన్ ఇండియా హీరోలతో పనిచేయడం జాన్వీ మార్కెట్ వాల్యూను మరింత పెంచుతోంది. -పెద్ది- చిత్ర బృందం ఇప్పటివరకు జాన్వీకి సంబంధించిన విజువల్స్ ని కానీ.. తన పాత్ర స్వభావాన్ని వెల్లడించకుండా సస్పెన్స్ మెయింటెయిన్ చేస్తోంది. అయితే సుకుమార్ రైటింగ్స్ వంటి ప్రతిష్టాత్మక బృందాలు రూపొందిస్తున్న చిత్రాల్లో నాయిక పాత్రలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. జాన్వీ కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా నటిగా తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. నటిగా తన అస్తిత్వాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి జాన్వీకి ఇది సదవకాశం. జాన్వీ తన తల్లి శ్రీదేవి నటించిన -జగదేకవీరుడు అతిలోకసుందరి- వంటి క్లాసిక్ చిత్రాల సీక్వెల్స్‌లో నటించాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. -పెద్ది- తర్వాత రామ్ చరణ్‌తో కలిసి ఈ ప్రాజెక్ట్‌లో నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే వైజయంతి అధినేత అశ్వినీదత్ నుండి ఇంకా ఎటువంటి స్పష్టత రాలేదు. ఇటువంటి వారసత్వ బాధ్యతాయుతమైన చిత్రాలు జాన్వీ కెరీర్‌కు మరో పెద్ద మలుపునిస్తాయనడంలో సందేహం లేదు. కెరీర్ ప్రారంభంలోనే ఉత్తరాది- దక్షిణాది వంటి విభిన్న ప్రాంతీయ భాషా చిత్రాలను ఎంచుకోవడం వల్ల జాన్వీ పలు రకాల పని సంస్కృతులను అర్థం చేసుకునే అవకాశం పొందుతోంది. ఇలాంటి పాన్-ఇండియా ప్రయత్నాలు జాన్వీని ఒక ప్రాంతానికి పరిమితం చేయకుండా గ్లోబల్ ఆడియన్స్‌కు చేరువ చేస్తున్నాయి. మొత్తానికి శ్రీదేవి నటవారసురాలిగా జాన్వీ ఎంచుకుంటున్న ఈ భారీ చిత్రాలు తనను కేవలం ఒక బాలీవుడ్ నటిగానే కాకుండా.. దక్షిణాదిలో కూడా తిరుగులేని స్టార్‌గా నిలబెట్టే అవకాశం ఉంది.



సాక్షి మాలిక్ గోల్డెన్ గ్లామర్‌లో టైమ్‌లెస్ గాంభీర్యంతో మెరిసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com